



# విజయభాను






విశాఖపట్నం, శుక్రవారం 24-11-2017 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 71 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## సాంకేతిక వినియోగంతో
# పారదర్శకత పెంపు



- అరవై నాలుగు వేల కోట్లు ఆదా
- రాయితీలు పక్కదారిపట్టకుండా చెక్
- వసుధైక కుటుంబానికి ఇది ప్రతిబింబం
- అందరికీ అందుబాటులో డిజిటల్ సాంకేతికత
- సైబర్ స్పేస్ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ

దిల్లీ: సాంకేతికత వినియోగం ద్వారా రాయితీ (సబ్సిడీ)ల్లో దాదాపు 64వేల కోట్ల రూపాయాల సొమ్ము ఆదా చేశామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. టెక్నాలజీ ఉపయోగించి ప్రత్యక్ష నగదు బదిలీ, బ్యాంకు ఖాతాలు, ఆధార్‌ను గుర్తించే బయోమెట్రిక్ ద్వారా రాయితీలు పక్కదారి పట్టకుండా విజయవంతంగా అడ్డుకున్నామని పేర్కొన్నారు. పారదర్శకత పెంచామన్నారు.

దిల్లీలో ఐదో సైబర్ స్పేస్ అంతర్జాతీయ సదస్సును ప్రధాని మోదీ ప్రారంభించారు. సమర్థవంతంగా సేవలు, పరిపాలన, మెరుగైన విద్య, వైద్యం అందించేందుకు ఉన్న అడ్డుగోడలను సాంకేతికత ధ్వంసం చేసిందన్నారు. భారతీయ తాత్వికత అయిన వసుధైక కుటుంబంను ఇది ప్రతిబింబిస్తుందని వివరించారు.

**ఆటస్థలం కారాదు!**

డిజిటల్ సాంకేతికతను అందరికీ అందుబాటులోకి తేవడం ద్వారా సాధికారత సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి తరువాయి 2లో




## తెలుగు రాష్ట్రాలకు
# త్వరలోనే శుభవార్త

- కడప, విశాఖలో ఉక్కు కర్మాగారం!
- విభజన చట్టంలో హామీలు అమలుచేస్తాం
- ఫ్యాక్టరీ ఏర్పాటుతో నిరుద్యోగం దూరం..
- కేంద్రమంత్రి బీరేంద్రసింగ్



దిల్లీ: ఉక్కు పరిశ్రమలకు సంబంధించి తెలుగు రాష్ట్రాలు త్వరలో శుభవార్త వింటాయని కేంద్రమంత్రి బీరేంద్రసింగ్ అన్నారు. గురువారం దిల్లీలో కేంద్రమంత్రి బీరేంద్రసింగ్‌తో కేంద్రమంత్రి సుజనాచౌదరి, ఏపీ మంత్రి సుజయకృష్ణ రంగారావు, తెలంగాణ మంత్రి కేటీఆర్ భేటీ అయ్యారు. విభజన చట్టంలో హామీ మేరకు కడప, బయ్యారంలో ఉక్కు కర్మాగారాల ఏర్పాటుపై చర్చించారు. సుమారు రెండు గంటల పాటు సాగిన సమావేశంలో విభజన చట్టం హామీలు నిలబెట్టుకోవాలని బీరేంద్రసింగ్‌ను కోరారు.

ఈ సందర్భగా బీరేంద్రసింగ్ మాట్లాడుతూ.. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కేంద్రం చిత్తశుద్ధితో ఉందన్నారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ నెలరోజుల్లో నివేదిక ఇస్తుందన్నారు. స్వల్పకాలికంగా, దీర్ఘకాలికంగా ఏ తరహా ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై చర్చ జరిగినట్లు తెలిపారు. నెల రోజుల తర్వాత మరోసారి సమావేశం నిర్వహిస్తామన్నారు. ఉక్కు నాణ్యత అధ్యయనానికి టాస్క్‌ఫోర్స్ కమిటీకి సమయం పడుతుందని పేర్కొన్నారు. 'కడపలో ఉక్కు కర్మాగారం వచ్చి తీరుతుంది. దీని ద్వారా కడప వాసులకు తరువాయి 2లో



# అన్నదాతకు వరప్రదాయిని చంద్రన్న రైతు రథం

- రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు
- వ్యవసాయ ఆధునీకరణమే ప్రధాన లక్ష్యం
- మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

విజయవాడ : అన్నదాతలకు వర్రపదాయిని చంద్రన్న రైతు రథం అని రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు అందించాలన్న సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పించారని ఏపీ జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం ఉదయం విజయవాడ జలవనరుల శాఖ కార్యాలయంలో మంత్రి తరువాయి 2లో

# అరకు ఎంపీకి బెదిరింపు మెయిల్స్



- సైబర్ క్రైమ్ చట్టాన్ని పటిష్టం చేయాలి
- పార్లమెంటులో ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతా
- కేంద్ర హోం మంత్రి దృష్టికి తీసుకెళ్తా
- అరకు ఎంపీ కొత్తపల్లి గీత

విశాఖపట్నం: 'నేను ఏసీబీ అధికారిని.. మీ వ్యక్తిగత ఆస్తులు, బ్యాంకు లావాదేవీలపై ఏసీబీకి ఫిర్యాదు వచ్చింది. అందుకు సంబంధించిన వివరాల ఫైల్ ఏసీబీ కార్యాలయంలో ఉంది. వివరాలు కావాలంటే నా ఎస్‌బీఐ అకౌంట్‌లో డబ్బులు వేయండి' అంటూ ఓ ఆగంతకుడు విశాఖ జిల్లా అరకు ఎంపీ కొత్తపల్లి గీతకు మెయిల్స్ పంపాడు. బెదిరింపు మొయిల్స్‌తో ఆమె స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విశాఖ కమిషనర్ ఈ సంఘటనపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

డబ్బులు అడుగుతూ బెదిరింపు మెయిల్స్ వస్తున్నాయని, తనకే కాక చాలామంది ఎంపీలకు డబ్బుల కోసం బెదిరింపు మెయిల్స్ వస్తున్నాయని చెప్పారు. ఫేక్ కాల్స్, మెయిల్స్ పై బ్యాంకులు కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల తన కుమారుడి అకౌంటు నుంచి రూ. 12 వేలు మాయమయ్యాయని.. ఎనిమిది నెలలైనా బ్యాంకుల నుంచి ఎలాంటి చర్యలు లేవన్నారు. సైబర్ క్రైమ్ అంశాలపై పార్లమెంటు సమావేశాలలో లేవనెత్తుతానన్నారు. సైబర్ క్రైమ్ చట్టాన్ని పటిష్టం చేయాలని పార్లమెంటులో ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతానని గీత చెప్పారు. సైబర్ క్రైమ్ ఘటనలను కేంద్ర హోం మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తున్నట్టు తెలిపారు.

# మంగళగిరిలో జనసేన పార్టీ కార్యాలయం

- ఆత్మకూరులో ఆదివారం శంఖుస్థాపన
- అమరావతిలో రాజకీయ సందడి

అమరావతి: సినీ నటుడు పవన్ కల్యాణ్ స్థాపించిన జన సేన పార్టీ కార్యాలయం గుంటూరు జిల్లా మంగళగిరిలో ఏర్పాటు కానుంది. చిన కాకాని వద్ద కార్యాలయం నిర్మించేందుకు జనసేన పార్టీ కోశాధికారి రాఘవయ్య భూమి హక్కుదారులతో అవగాహన ఒప్పందం చేసుకున్నారు. యార్లగడ్డ వెంకటేశ్వరరావు, సాంబశివరావు, అంకినీడు ప్రసాద్‌కు చెందిన 3.42 ఎకరాల భూమిని మూడేళ్ల పాటు అద్దెకు తీసుకున్నారు. నెలకు ఎకరాకు రూ.50వేల చొప్పున చెల్లించేందుకు తరువాయి 2లో

## విశాఖలో విమాన ప్రయాణికుల ఆందోళన



విశాఖ: ఎయిర్ ఏసియా విమానంలో సాంకేతికలోపం తలెత్తింది. విశాఖ నుంచి ఉదయం 11గంటలకు బెంగళూరు వెళ్లాల్సిన ఎయిర్ ఏసియా విమానం ఆలస్యం కావడంతో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ప్రయాణికుల్లో 23 మంది అయ్యప్ప భక్తులు ఉన్నారు. బెంగళూరు నుంచి మధ్యాహ్నం 3 గంటలకు అయ్యప్ప భక్తులు మరో విమానంలో తరువాయి 2లో

# శశికళ వర్గానికి మరో షాక్ !

- ఈపీఎస్-ఓపీఎస్ వర్గానికే రెండాకుల గుర్తు
- కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టత



చెన్నై : తమిళనాడులో శశికళ వర్గానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అన్నాడీఎంకే రెండాకుల గుర్తుపై కేంద్ర ఎన్నికల సంఘం గురువారం స్పష్టతనిచ్చింది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి వర్గానికే రెండు ఆకుల గుర్తును కేటాయిస్తూ ఈసీ నిర్ణయం తీసుకుంది.

జయలలిత మృతి తర్వాత తరువాయి 2లో

## టేకిట్ ఈజీ



అ వాగ్దానాల జాబితా రాసుకోవే బాబూ... వాటికి కొన్ని జతచేసి మేనిఫెస్టో తయారు చేసుకుంటామ్ !!

# ఎవ్వరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దు..



- రైతుల ఆత్మహత్యాయత్నంపై
- చలించిన జగనన్న
- రైతులతో ఫోనులో మాట్లాడిన జగన్

వెల్దుర్తి : కృష్ణాజిల్లా నున్న పోలీస్ స్టేషన్ ఆవరణలో రైతుల ఆత్మహత్యాయత్నం ఘటన అంశంపై ప్రతిపక్ష నేత, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చలించిపోయారు. ఆత్మహత్యాయత్నం చేసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఆయన గురువారం ఫోన్‌లో పరామర్శించారు. ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని రైతులకు ఈ సందర్భంగా వైఎస్ జగన్ ధైర్యం చెప్పారు. వైఎస్ఆర్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం తరఫున రూ.2.30 కోట్లు చెల్లిస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఒక్క ఏడాది ఓపిక పట్టండి.. ఆ తరువాయి 2లో




# హాంకాంగ్ సూపర్ సిరీస్‌లో సైనా ఓటమి



*కౌలూన్: హాంకాంగ్ ఓపెన్ సూపర్ సిరీస్ బ్యాడ్మింటన్ టోర్నీ రెండో రౌండ్‌లో భారత స్టార్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ ఓటమి పాలైంది. నిన్న జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో డెన్మార్క్ అమ్మాయి పొలెన్స్‌పై సైనా విజయం సాధించి రెండో రౌండ్లోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఇవాళ జరిగిన రెండో రౌండ్లో చైనా క్రీడాకారిణి చెన్ యుఫీ చేతిలో సైనా 21-18, 19-21, 10-21 తేడాతో ఓటమి చవిచూసింది.*

# శ్రీకన్య రెస్టారెంట్‌ను ప్రారంభించిన అంతర్జాతీయ దర్శకులు రాజమౌళి



కాకినాడ : కాకినాడ భానుగుడి సెంటర్లో ఉన్న శ్రీకన్య ఫ్యామిలీ రెస్టారెంట్‌ను అంతర్జాతీయ దర్శకులు ఎస్ఎస్ రాజమౌళి దంపతులు ప్రారంభించారు. రాజమౌళి కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్న కాకినాడ నివాసి టి.వి.వి.సత్యనారాయణరెడ్డి భానుగుడి సెంటర్ సమీపంలో శ్రీకన్య ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభోత్సవానికి బాహుబలి చిత్ర దర్శకులు రాజమౌళిని ఆహ్వానించారు. గురువారం సాయంత్రం దర్శక ధీరుడు రాజమౌళి భార్య రమా రాజమౌళితో కలిసి రెస్టారెంట్‌ను ప్రారంభించారు. అనంతరం వేద మంత్రోచ్చారణలతో సాగిన పూజా కార్యక్రమాలలో రెస్టారెంట్ అధినేత సత్యనారాయణరెడ్డి దంపతులతో కలిసి రాజమౌళి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ తన స్నేహితుడికి చెందిన రెస్టారెంట్‌ను కాకినాడలో ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. రెస్టారెంట్ ఆహార ప్రియులకు పసందైన రుచులను అందుబాటు ధరల్లో అందించాలని సూచించారు. రెస్టారెంట్ అధినేత సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ దర్శకధీరుడి చేతుల మీదుగా రెస్టారెంట్‌ను ప్రారంభించు కోవడం అమితానందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి అంబేద్కర్

**- మాజీ ఎంపి హర్షకుమార్**



ఆలమూరు : భారత రాజ్యాంగ నిర్మాత ప్రపంచం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి డా॥ బి.ఆర్. అంబేద్కర్ అని మాజీ ఎంపి హర్షకుమార్ అన్నారు. మండల పరిధి మూలస్థాన అగ్రహారం గ్రామంలో గురువారం అంబేద్కర్ యువజన సంఘం వారు ఏర్పాటు చేసిన డా॥ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని మాజీ ఎంపి హర్షకుమార్ ఆవిష్కరించి, మాట్లాడుతూ అంబేద్కర్ ఒక కులంకోసమే రాజ్యాంగం రాయలేదని, యావత్తు భారతజాతి కోసం రాజ్యాంగం రచించారన్నారు. కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం ఎక్కడా లేని విధంగా కిర్లంపూడి కాపుల వీధిలో అంబేద్కర్ విగ్రహం పెట్టి ఆయన అందరివాడు అని ఆయన విగ్రహాలు ఒక దళితపేటకే పరిమితం చేయకుండా రాష్ట్ర వ్యాప్తంగా కాపుల వీధిలో పెట్టే ఆలోచన చేయాలని పిలుపునివ్వటం అందరూ గర్వించదగ్గ విషయమని హర్ష కుమార్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యర్రంశెట్టి వెంకాయమ్మ, ఉపసర్పంచ్ వానపల్లి సత్యనారాయణ, ఆలమూరు పశు సంవర్ధకశాఖ ఏడిఏ డా॥ ఓ.రామకృష్ణ, ఆలమూరు యువపారిశ్రామిక వేత్త వంటిపల్లి పాపారావు, పామర్తి శ్రీనివాసు, గానుగుల చిన్న, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, పార్టీలకతీతంగా గ్రామానికి చెందిన అన్నివర్గాల ప్రజలు పాల్గొన్నారు.

# తెదేపాలో చేరిన నల్లారి



అమరావతి: మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సోదరుడు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి తెదేపాలో చేరారు. కిషోర్‌కుమార్‌కు తెదేపా జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కిషోర్‌కుమార్ తనయుడు అమర్‌నాథ్‌రెడ్డి, జిల్లా నుంచి అనుచరులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేసినప్పుడు వారు చూపే ఆదరణ ఎంతో ముఖ్యం. నల్లారి అమర్‌నాథ్‌రెడ్డి నేను కలిసి పని చేశాం. కిషోర్‌కుమార్‌రెడ్డి రాజకీయ భవిష్యత్ నాకు తెలియనిది కాదు. చిత్తూరు రాజకీయాలు నాకు తెలియనివి కావు. హేతుబద్దత లేని విభజన జరుగుతుంటే రాష్ట్ర భవిష్యత్తు కోసం కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండి కూడా గట్టిగా పోరాడారు. జగన్, సోనియా కుమ్మక్కై విభజన చేస్తుంటే.. కిరణ్‌కుమార్‌రెడ్డి చిత్తశుద్ధితో పని చేశారు. నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కిషోర్‌కుమార్‌రెడ్డి తెదేపాలో చేరారు. అనునిత్యం ప్రజలతోనే ఉంటారు.

పీలేరులో ఇక వన్‌సైడ్ ఎలక్షన్ జరుగుతుంది. కుప్పంతో పోటీపడి పీలేరులో కూడా మంచి మెజారిటీ రావాలి. చిత్తూరు జిల్లాలో 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కుటుంబం నల్లారి కుటుంబం. నల్లారి కుటుంబం అంటే నాకు ఎంతో గౌరవం ఉంది. నల్లారి కుటుంబం పీలేరు నియోజకవర్గానికి ఎంతో అవసరం అని చంద్రబాబు వివరించారు. కిషోర్‌కుమార్‌ను పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమిస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు.

# చెక్‌బుక్ రద్దుపై కేంద్రం క్లారిటీ!

న్యూఢిల్లీ: డిజిటల్ లావాదేవీలకు పెంపునకు చెక్‌బుక్‌లు రద్దు చేస్తారంటూ వస్తున్న వార్తలపై కేంద్రం స్పందించింది. అలాంటి ఆలోచన ఏదీ లేదని స్పష్టంచేసింది. ఇటీవల వ్యాపారుల సమాఖ్య కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్‌వాల్ మాట్లాడుతూ చెక్‌బుక్‌ల రద్దు చేసేందుకు కేంద్రం యోచిస్తోందని తెలిపారు. డిజిటల్ లావాదేవీల పెంపుదలలో భాగంగా ఈ నిర్ణయం తీసుకోవచ్చని వ్యాఖ్యానించారు.

ఈ నేపథ్యంలో చెక్‌బుక్కుల రద్దు గురించి ప్రచారం వూపందుకుంది. ఈ నేపథ్యంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పందించింది. చెక్‌బుక్‌లను రద్దు చేసే యోచన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని పేర్కొంది. డిజిటల్ లావాదేవీల ప్రోత్సాహంలో భాగంగా సమీప భవిష్యత్‌లో చెక్‌బుక్‌లను ప్రభుత్వం రద్దు చేస్తుందంటూ ఒక వర్గం మీడియా విస్తృత ప్రచారం చేసింది. దీన్ని ఖండిస్తున్నాం. అలాంటి ప్రతిపాదనేదీ మా వద్ద లేదు అని ఆ శాఖ ట్వీట్ చేసింది.

# శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

గాజువాక: జీవియంసీ 49వ వార్డు ప్రకాష్ నగర్‌లో ఇటీవల నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ ప్రత్యేక పూజాకార్యక్రమంలో వార్డు తేదేపా అధ్యక్షులు మజ్జిసోమేష్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమేష్ మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారంటే మహిళలకు ఎనలేని భక్తిఅని అన్నారు. మార్గశిరమాసంలో నగరంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి గుడికి వెళ్ళేందుకు భక్తులు చాలా ఇబ్బందులు ఏదుర్కోనవలసి వచ్చేదని, దీనిని దృష్టిలో పెట్టుకొని స్థానిక భక్తుల సౌకర్యార్థం శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయాన్ని నిర్మించడం జరిగిందని అన్నారు. ఈ ఏడాది నుంచి నిర్వహించు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంత భక్తులు అమ్మవారిని దర్శించుకొని అమ్మవారి కృపాకటాక్షములు పొందాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పాత నేరస్తుడు రాజుభాయ్ అరెస్టు

## - 896 గ్రాముల బంగారం - 2250 గ్రాముల వెండి..ఒక మోటార్ సైకిల్ స్వాధీనం



కాకినాడ : తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేట గ్రామానికి చెందిన నూతాటి అర్జున్ అలియాస్ రాజుభాయ్ అనే పాత నేరస్తుడిని క్రైం పోలీసులు అరెస్టు చేసి కాకినాడ ఎస్పీ కార్యాలయంలో మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ విశాల్‌గున్ని మాట్లాడుతూ 2009 నుండి కాకినాడ, ఇంద్రపాలెం, పెద్దాపురం, రాజమహేంద్రవరం, విశాఖ జిల్లా ఎస్.రాయవరంలలో ఇల్లు దొంగతనాలు చేసి జైలుశిక్ష అనుభవించి తిరిగి బయటకువచ్చిన రాజుభాయ్ 2012 నుండి పెద్దాపురంలో ఒక ఇంట్లో 142 గ్రాముల బంగారం, 2 కేజీల వెండి దొంగిలించి భార్యా బిడ్డలతో కలిసి నెల్లూరు జిల్లా ముత్తూకూరు గ్రామానికి వెళ్లి అక్కడ కాపురం పెట్టి కృష్ణాపట్నం సర్కిల్ పరిధిలో 2013 నుండి 2017 వరకు ముత్తుకూరు, టిపి గూడూరు మండలాలలో సుమారు 18 నేరాలను చేయడం జరిగిందన్నారు. తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంలో ఒక ఇంట్లో 30గ్రాముల బంగారం, ఒక కేజీ వెండి, నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంలో 11 నేరాలు, 728 గ్రాముల బంగారం, 950 గ్రాముల వెండి, ఒక ఇన్వర్టర్, ఒక బ్యాటరీని, నెల్లూరు జిల్లా టిపి గూడూరు మండలంలో నేరాలలో 128 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండిని దొంగిలించాడని తెలిపారు. జైలు నుండి విడుదల అయిన పాత నేరస్తులను నిఘాలో ఉంచిన కాకినాడ సిసిఎస్ క్రైం డిఎస్పీ పల్లపురాజు ఆధ్వర్యంలో పెద్దాపురం సిఐ, నెల్లూరు జిల్లా ముత్తుకూరు ఎస్ఐ,సిబ్బంది రాజుభాయ్‌ను జి.రాగంపేటలోని అరెస్టు చేసి 19 కేసులలో దొంగిలించిన బంగారంలో సుమారు 896 గ్రాముల బంగారం, 2250 గ్రాముల వెండిని, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ సుమారు రూ.19 లక్షలు ఉంటుందని ఎస్పీ విశాల్‌గున్ని వివరించారు. ఈ సమావేశంలో క్రైం డిఎస్పీ పల్లపురాజు, సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## అన్నదాతకు వరప్రదాయిని చంద్రన్న రైతు రథం

ఉమా మాట్లాడుతూ, వ్యవసాయాన్ని ఆధునీకరించాలన్న సదాలోచనతో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అన్నదాతలకు సబ్సిడీపై ట్రాక్టర్లు పంపిణీ చేస్తుందని అన్నారు. అనంతరం ఇబ్రహీంపట్నం మండలం, ములపాడు గ్రామానికి చెందిన గరికపాటి వెంకటేశ్వరరావు, ఆళ్ల నరసింహరావుకు మంత్రి ఉమా చంద్రన్న రైతురథం ట్రాక్టర్లు అందజేశారు.

## సాంకేతిక వినియోగంతో పారదర్శకత పెంపు

ఉందని ప్రధాని మోదీ నొక్కి చెప్పారు. ఎం-పవర్ ద్వారా ప్రజలను ఎంపవర్ చేస్తామన్నారు. పొంచి ఉన్న సైబర్ దాడుల ముప్పును ఉటంకిస్తూ డిజిటల్ స్పేస్‌లో ఉగ్రవాదానికి తావు ఇవ్వరాదన్నారు. తీవ్రవాదం, తిరుగుబాటు దారులకు ఇది ఆటస్థలం కాకుండా జాతి బాధ్యత తీసుకోవాలన్నారు. విద్య, వైద్య రంగాల్లో సృజనల కోసం డిజిటల్ సాంకేతికను బాగా ఉపయోగించాలని సూచించారు. స్వభావరీత్యా ఇంటర్నెట్ సమ్మిళతం చేస్తుందన్నారు. అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తుందన్నారు. అందరూ సైబర్ స్పేస్‌ను వినియోగించుకునేలా సామాజిక మాధ్యమ వేదికలు పురికొల్పుతున్నాయని పేర్కొన్నారు. స్టూడియోల్లో నిపుణులు రూపొందించే వార్తలు ఇప్పుడు సోషల్ మీడియా ద్వారా వస్తున్నాయన్నారు. ఈ అంతర్జాతీయ సదస్సు రెండు రోజులు పాటు జరగనుంది.

ఆధార్‌తో క్యాష్‌లెస్ లావాదేవీలు..

ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. పెన్షనర్లు బ్యాంక్ ముందు నిలబడాల్సిన అవసరం లేదని, ఆధార్‌తో తమ జీవన ప్రమాణ పత్రాలను సమర్పించవచ్చు అన్నారు. డిజిటల్ టెక్నాలజీ వల్ల మహిళలు పారిశ్రామికవేత్తలుగా మారుతున్న ఘటనలు పెరిగినట్లు ఆయన తెలిపారు. టెక్నాలజీ వల్లే క్యాష్‌లెస్ లావాదేవీలు పెరిగాయన్నారు. భీమ్ యాప్ ద్వారా అవినీతి రహిత సమాజాన్ని క్రియేట్ చేస్తున్నామన్నారు. మొబైల్ పవర్ ద్వారా పౌరులు సాధికారత సాధిస్తున్నారని మోదీ అన్నారు. డిజిటల్ టెక్నాలజీ వల్ల వ్యవసాయ లాభాలు కూడా పెరిగినట్లు ప్రధాని తెలిపారు. ప్రభుత్వ ఈ-మార్కెట్‌లో ఓ చిన్న వ్యాపారి కూడా రిజిస్టర్ చేసుకోవచ్చు అని, తన ఉత్పత్తులను ప్రభుత్వానికి అమ్ముకునే వీలుందన్నారు. జన్ భాగీదారీ పెంచేందుకు డిజిటల్ డొమేయిన్‌ను వాడుతున్నట్లు ఆయన తెలిపారు. ఉమంగ్ మొబైల్ యాప్ ద్వారా అనేక సేవలు అందించనున్నారని మోదీ తెలిపారు. అందరు కలిసి ప్రగతి సాధిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రధాని అన్నారు.

**100 సేవలు ఒకే యాప్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ..**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం ఉమంగ్ (UMANG) పేరుతో ఓ సరికొత్త ఈ-గవర్నెన్స్ యాప్‌ను ఆవిష్కరించారు. యూనిఫైడ్ మొబైల్ అప్లికేషన్ ఫర్ న్యూఏజ్ గవర్నెన్స్‌కి సంక్షిప్త నామమే ఉమంగ్. ఈ యాప్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన దాదాపు 100కు పైగా సేవలు అందుకునే సౌకర్యం ఉంటుంది. ప్రస్తుతం ఉమంగ్ ద్వారా బిల్లు చెల్లింపులు, ఆదాయపన్ను ఫైలింగ్స్, ఆధార్ సంబంధిత వివరాలు సహా పలు సేవలు అందిస్తున్నారు. ఆధార్ నంబర్ అనుసంధానంతో పాటు సోషల్ మీడియా ఖాతాలను కూడా ఈ యాప్‌తో లింక్ చేసుకునేందుకు ఉమంగ్ అవకాశం కల్పిస్తోంది.

**ఆ రెండిటినీ సరితూచడం సాధ్యమే**
**ప్రధాని నరేంద్ర మోదీ**

వ్యక్తిగత గోప్యత, ఆధార్‌ల గురించి చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గట్టి భరోసా ఇస్తున్నారు. గురువారం జరిగిన సైబర్ స్పేస్‌పై అంతర్జాతీయ సదస్సులో మోదీ మాట్లాడుతూ బాహాటంగా వెల్లడించడం, జాతీయ భద్రత మధ్య సమతుల్యతను సాధించవచ్చునని తెలిపారు. వ్యక్తిగత గోప్యత, బహిరంగతలను ఓ వైపు, జాతీయ భద్రతను మరోవైపు ఉంచి సరితూచవచ్చునని చెప్పారు.

ఉగ్రవాదం, రాడికలైజేషన్ వంటి చీకటి శక్తులకు క్రీడా స్థలంగా సైబర్ స్పేస్ మారకుండా దేశాల ప్రభుత్వాలు బాధ్యత వహించాలని మోదీ చెప్పారు.

## తెలుగు రాష్ట్రాలకు త్వరలోనే శుభవార్త

ఉద్యోగాలు వస్తాయి. కడప ఉక్కు కర్మాగారానికి, విశాఖలో ఏర్పాటయ్యే కర్మాగారానికి సంబంధం లేదు'' అని కేంద్రమంత్రి సుజనాచౌదరి స్పష్టం చేశారు.

**విశాఖలో మరో ఉక్కు ఫ్యాక్టరీ..**

'కడప ఉక్కు కర్మాగారం ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివరాలు అడిగారు. విశాఖలో మరో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం మేరకు విశాఖలో మరో ఉక్కు కర్మాగారం ఏర్పాటవుతుంది'' అని ఆంధ్రప్రదేశ్ మంత్రి సుజయకృష్ణ రంగారావు తెలిపారు.

## ఎవ్వరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దు..

చెల్లింపులన్నీ వెంటనే చేస్తాం అని ఆయన తెలిపారు. ఇదే విషయాన్ని తన మాటగా నష్టపోయిన రైతులకు చెప్పాలన్నారు. అఘాయిత్యాలకు పాల్పడి కుటుంబాల్లో కన్నీళ్లు నింపొద్దని విజ్ఞప్తి చేశారు. అలాగే... రైతులను కాపాడాల్సిన ప్రభుత్వం వారిని వేధింపులకు గురిచేయడంపై వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా రైతుల తమ వేదనను రాజన్న తనయుడికి వెలిబుచ్చారు... దాదాపు ఏడాదిన్నరగా పోరాటం చేస్తున్నామని, నకిలీ నార కారణంగా పంట నష్టపోయామని అప్పట్లో ధర్నా చేశామని, నార నకిలీదని శాస్త్రవేత్తలు కూడా నిర్ధారించారని అన్నారు. ఎకరాకు రూ.91వేలు చెల్లించేలా కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారని, కాని చెల్లింపులు జరగలేదన్నారు. కంపెనీల యజమానులు కోర్టుకు వెళ్లి కలెక్టర్ ఉత్తర్వులు కొట్టేయించుకున్నారని, ఈ విషయాన్ని మంత్రి సోమిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి నాలుగుసార్లు నివేదించామని, మరో మంత్రి దేవినేని ఉమకి రెండుసార్లు విన్నవించామని, గత ఏడాది అసెంబ్లీకి వచ్చి తమ గోడు వెళ్లబోసుకున్నా ఫలితం లేదుని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు ఇప్పుడు చలో అసెంబ్లీకి నిర్ణయించుకున్నామన్నారు. అయితే తమపై రౌడీషీట్లు తెరిచారంటూ వైఎస్ జగన్‌కు రైతులు ఫిర్యాదు చేశారు. కేసులు పెట్టి పత్రాలు రాయించుకుని నానా ఇబ్బందులకు గురి చేశారని గోడు వెళ్లబోసుకున్నారు. రూ.2.30 కోట్ల చెల్లింపుల కోసం అలుపెరగని పోరాటం చేశామని, ఎవ్వరూ కనికరించక పోవడంతో ఆత్మహత్యే శరణ్యం అనుకున్నామని ఆ రైతులు వాపోయారు.

నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు తక్షణమే చెల్లించాల్సిన పరిహారాన్ని ప్రభుత్వం ఇవ్వాలని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు. అవసరం అయితే విత్తన కంపెనీల నుంచి ప్రభుత్వం రికవరీ చేసుకోవచ్చని అన్నారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని అన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే అధికారంలోకి రాగానే రైతులకు చెల్లించాల్సిన పరిహారం ఇస్తామని అన్నారు.

## విశాఖలో విమాన ప్రయాణికుల ఆందోళన

కోచి వెళ్లాల్సి ఉంది. దీంతో అయ్యప్ప భక్తులు ఆందోళనకు దిగారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ప్రయాణికులతో మాట్లాడి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు.

## మంగళగిరిలో జనసేన పార్టీ కార్యాలయం

ఒప్పందం చేసుకున్నారు. తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయానికి మంగళగిరి మండలం ఆత్మకూరులో ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. రాజకీయ పార్టీల కార్యాలయాల ఏర్పాటుతో అమరావతిలో రాజకీయ సందడి ప్రారంభం కానుంది.

## శశికళ వర్గానికి మరో షాక్!

అన్నాడీఎంకేలో వర్గపోరు తలెత్తింది. శశికళ, పన్నీర్‌సెల్వం వర్గాలుగా విడిపోయి.. అధికారం కోసం తీవ్ర యత్నాలు చేశారు. ఈ నేపథ్యంలో శశికళ వర్గానికి చెందిన యడప్పాడి పళనిస్వామి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. తర్వాతి పరిణామాల నేపథ్యంలో పళనిస్వామి, పన్నీర్‌సెల్వం ఒక్కటై శశికళను, ఆమె మేనల్లుడు దినకరన్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు. ఇరు వర్గాలు పార్టీ గుర్తు తమకే కేటాయించాలని ఈసీని ఆశ్రయించారు. మరోవైపు రెండాకుల గుర్తును తమకే కేటాయించేలా ఎన్నికల సంఘంలోని ఓ అధికారికి లంచం ఇచ్చేందుకు యత్నించి దినకరన్ దొరికిపోవడం తీవ్ర సంచలనం సృష్టించింది. గత కొంత కాలంగా ఈ గుర్తును ఎవరికి కేటాయించాలనే అంశంపై తీర్పును రిజర్వ్‌లో పెట్టిన ఎన్నికల సంఘం ఎట్టకేలకు గురువారం తుది నిర్ణయం వెలువరించింది. దీంతో అన్నాడీఎంకే అధికార వర్గ శ్రేణుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. మరోవైపు తాజా పరిణామం తమిళనాడులోని రాజకీయ పరిస్థితులను మరెన్ని మలుపులు తిప్పుతుందో చూడాలి.

## ఘనంగా భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి 92వ జయంతి మహోత్సవాలు

భీమునిపట్నం: భీమునిపట్నంలో గల భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి 92వ జయంతి మహోత్సవాలు మూడు రోజులు పాటు ఘనంగా జరిగాయి గురు ఉదయం ఐదు గంటలకు సుప్రభాతం నగర సంకీర్తన, ఎనిమిది గంటలకు పతాకా విష్కరణ, తొమ్మిది గంటలకు సాముహిక భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య వత్రము, మధ్యాహ్నం పన్నెండు గంటలకు మహనారాయణ సేవ నిర్వహించారు.

మూడు గంటలకు 92 జ్యోతులు వెలిగించారు. అనంతరం పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా సేవ సమితి సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు

# హుదూద్ తుఫానులో దెబ్బతిన్న గృహాలకు రేకులు పంపిణీ



రేకులు అందజేస్తున్న ద్రోణంరాజు

విశాఖపట్నం: నిత్య సేవాతత్పరుడు సుబ్బరామిరెడ్డి అని ద్రోణంరాజు అన్నారు. హుదూద్ తుపానులో దెబ్బతిన్న గృహాలకు పైకప్పు (రేకు)లను రాజ్యసభ సభ్యులు సుబ్బరామిరెడ్డి అందజేయగా సొంత నిధులతో సమకూర్చగా వాటిని పీసీసీ కార్యదర్శి గొంపా గోవింద్ ఆధ్వర్యంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాసరావు గురువారం 33వ వార్డు కాంగ్రెస్ కార్యాలయంలో స్థానికులకు అందజేశారు. ఈ సందర్భంగా ద్రోణంరాజు మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులు సుబ్బరామిరెడ్డి కొన్ని దశాబ్దాలుగా నగర ప్రజలకు అధికారంతో సంబంధం లేకుండా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు. ప్రజల కోసం నిత్యం సేవ చేయాలనే సంకల్పం గల నిత్యసేవాతత్పరుడు సుబ్బరామిరెడ్డి అని అన్నారు. పార్టీలకు అతీతంగా నగరంలో ఆయన చేస్తున్న సేవలు నగరంలోని లక్షలాది మందికి లబ్ధిచేకూరుస్తున్నాయని తద్వారా ఆయన ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రతి ధనవంతుడు సుబ్బరామిరెడ్డిని ఆదర్శంగా తీసుకొని సేవలు అందజేయాలని కోరారు. నగర కాంగ్రెస్ అధ్యక్షులు బెహరా భాస్కరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు రాజ్యసభ సభ్యులు సుబ్బరామిరెడ్డి నగర ప్రజలకు అందిస్తున్న సేవలు అనిర్వచనీయమని అన్నారు. సుబ్బరామిరెడ్డి నిత్యం నగరంలో ఏదో ఒక ప్రాంతంలో సేవా కార్యక్రమాలు ప్రజలకు చేస్తున్నారని అన్నారు. స్వయం కృషితో ఎదిగి తన సొంత నిధులతో సేవలందించడం ఆయనకు ఒక్కరికే చెందిందన్నారు. సుబ్బరామిరెడ్డి సేవాపీఠం కార్యదర్శి ఎస్కే బాష మాట్లాడుతూ సేవాకార్యక్రమాలు ప్రతిఒక్కరికీ అందేవిధంగా చూడాలని వారు ఆనందంగా ఉంటే నేను సంతోషంగా ఉండగలుగుతానని ఆయన అంటుంటారని చెప్పారు. కార్యక్రమంలో నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, కాంగ్రెస్ నాయకులు వేగి వెంకటేష్, గొంటు మోహన్‌రావు, గొంపా శ్రీధర్, ముప్పిడి గౌరీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో లైఫ్ సైన్సెస్ స్కిల్ డెవలప్‌మెంట క్యాంపస్

- వంద కోట్ల వ్యయంతో ఏర్పాటు
- పల్సస్ గ్రూప్ సిఈఓ డాక్టర్ జి.శ్రీనుబాబు



ప్రసంగిస్తున్న డాక్టర్ జి.శ్రీనుబాబు

ఆంధ్ర యూనివర్శిటీః విశాఖ కేంద్రంగా లైఫ్ సైన్సెస్ స్కిల్ డెవలప్‌మెంట్ క్యాంపస్‌ను ఏర్పాటు చేస్తామని ఏయూ పూర్వవిద్యార్థి, పల్సస్ గ్రూప్ సిఈఓ డాక్టర్ జి.శ్రీనుబాబు తెలిపారు. గురువారం ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఎన్విరాన్‌మెంటల్ బయోటెక్నాలజీ అంతర్జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో ఆయప పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెద్దసంఖ్యలో లైఫ్‌సైన్సెస్‌లో పీజీలు పూర్తిచేసిన విద్యార్థులు లభిస్తున్నారన్నారు. వీరిలో ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ఎంతో అవసరమన్నారు. ఐటి రంగంలో ఇప్పటికే తెలుగు ప్రజలు తమసత్తా చాటుతున్నారని, ఆదే స్థాయిలో లైఫ్‌సైన్స్ రంగలో నిపుణులు సైతం సత్తా చాటే దిశగా తమ కేంద్రం పని చేస్తుందన్నారు. తానుస్థాపించిన ఒమిక్స్ పబ్లిషింగ్ గ్రూప్‌లో వందమందికి పైగా పిహెచ్‌డి విద్యార్హత కలిగిన వ్యక్తులు పనిచేస్తు న్నారన్నారు. వీరు విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేసే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో అవస రమైన శిక్షణ కార్యక్రమాలను చేపడ తారన్నారు. తమ సంస్థ ప్రపంచంలోని 40కి పైగా దేశాలతో శాస్త్రీయ రంగాలలో పనిచేస్తోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నిపుణులను తీసుకువచ్చి అవస రమైన శిక్షణ అందించడం సాధ్య పడు తుందన్నారు. కాపులుప్పాడలో పది ఎకరాల సువిశాల ప్రాంగణంలో దీనిని వందకోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తామన్నారు. తొలిదశలో 500 మందికి ఉపాధిని అందించే విధంగా ప్రారంభించి రానున్న రెండు సంవత్స రాల కాలంలో రెండు వేల మందికి ఉపాధిని అందించడం తమ సంస్థ లక్ష్యమన్నారు. ఫార్మశీ, ఎంటెక్, బిటెక్, ఎమ్మెస్సీ లైఫ్‌సైన్సెస్ పూర్తిచేసిన వారికి అవసరమైన సాంకేతిక శిక్షణను మూడు నుంచి ఆరు నెలల కాలం అందించడం జరుగు తుందన్నారు. భవిష్యత్తులో వ్యక్తి ఆధారితంగా ఔషధాల రూపకల్పన చేసి అందించడం సాధ్యపడుతుందన్నారు. జీవ సూచికలు తయారీ వంటి అత్యంత ప్రభావ రంగాలలో పనిచేయడం ఎంతో అవసంమన్నారు.తాను స్థాపించిన ఒమిక్స్ ఇంటర్నేషనల్‌లో ఇప్పటికే హైదరాబాద్, దిల్లీ, చెన్నైలలో 3 వేల మందికి ఉపాధిని కల్పించడం జరిగిందన్నారు. ఒమిక్స్ పబ్లిషింగ్ గ్రూప్ తీర్చిదిద్దిన సాంకేతిక జర్నల్స్‌ను నేడు ప్రపంచ వ్యాప్తంగా 5 కోట్ల మంది ఉచితంగా పొందడం జరుగు తోందన్నారు. శాస్త్రీయ జ్ఞానాన్ని అందరికీ అందించే దిశగా పనిచేస్తున్నామన్నారు.

# ఘనంగా సత్యసాయి బాబా జన్మదిన వేడుకలు



పెందుర్తి : భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి జన్మదిన వేడుకలు చినముషిడివాడలో ఉన్నా బాబా మందిరములో ఘనంగా జరిపించారు. ఉదయాన్నే స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తరువాత నిరు పేదలకు బట్టలు, చీరలు, దుప్పటలను మంది రము కన్వీనర్ ఈటీ సీతయ్య నాయుడు అందజేశారు. ఆనంతరం మంది రము వద్ద వందలాది మందికి అన్న వితరణ చేశారు. ఈ మందిర నిర్మాణానికి చేయుతనిచ్చిన ఎస్.మూర్తి, ఆర్. రమేష్‌లు ఈ బట్టలు పంపిణి కార్యాక్రమంలో పాల్గొన్నారు.

# ప్రశాంతి పాలిటెక్నిక్‌లో భారీ జాబ్ మేళా

అచ్యుతాపురం: స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో బారీ జాబ్ మేళా (ప్రాంగణ ఎంపికలు) నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు గురువవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెటిరొ డ్రగ్స్ పరిశ్రమవారు ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఐటిఐ అర్హత గల అభ్యర్దులకు 100 ఖాళీలు, డిగ్రీ కెమిస్ట్రీ అర్హత గల అభ్యర్దులకు 100 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు.

ఆశక్తి గల నిరుద్యోగ యువతి యువకులు శుక్రవారం ఉదయం గ॥10లకు కళాశాలకు ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో హాజరవ్వాలన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## టిఎస్సార్ సేవాపీఠం ఆధ్వర్యంలో

# ఉచిత వైద్య శిబిరాలు

విశాఖపట్నం: డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి సేవాపీఠం ఆధ్వర్యంలో గురువారం నగరంలోని పలుచోట్ల సంచార వైద్యశాలలు నిర్వహించారు. గన్నేరు వీధి, రంగిరీజువీధి, పెదజాలారిపేట, వైఎస్సార్ కాలనీ, నందగిరి నగర్, శ్రీనివాసనగర్, దయాల్‌నగర్, సిద్ధేశ్వరం తదితర ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. 922 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్య సేవలు పొందిన వారు రాజ్యసభ సభ్యులు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

# బయోటెక్నాలజీలో స్వయం సంవృద్ధి సాధించాలి

## కేంద్ర పెట్రోలియం, నేచురల్ గ్యాస్ స్టాండింగ్ కమిటి చైర్మన్ ప్రహ్లాద్ జోషి



ప్రత్యేక సంచికను విడుదల చేస్తున్న ప్రహ్లాద్ జోషి

ఆంధ్ర యూనివర్శిటీః బయోటెక్నాలజీ రంగంలో భారత్ స్వయం సంవృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని కేంద్ర పెట్రోలియం, నేచురల్‌గ్యాస్ స్టాండింగ్‌కమిటి చైర్మన్ ప్రహ్లాద్ జోషి అన్నారు. గురువారం ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఒమిక్స్ పబ్లిషింగ్ గ్రూప్ సంయుక్తంగా ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరిగ్ కళాశాల వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహిస్తున్న ఎన్విరాన్‌మెంటల్ బయోటెక్నాలజీపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచ మార్కెట్‌లో 2శాతం వాటాను, ఆసియాలో మూడవ అతిపెద్ద రంగంగా భారత్ బయోటెక్నాలజీ రంగం నిలుస్తోందన్నారు. పెట్టుబడిదారులకు అవసరమైన అపార అవకాశాలను ఈ రంగం కల్పిస్తోందన్నారు. గ్లోబల్ లీడర్‌గా భారత్ నిలవాల్సిన అవసరం ఉందని, ఈ దిశగా విద్యార్థులకు నిర్దేశిత లక్ష్యాలను చేరుకునే విధంగా విశ్వవిద్యాలయాలు మార్గ నిర్దేశం చేయాలన్నారు. భారతీయ సాంప్రదాయాలు, సంసృతిలో సైన్స్ ఇమిడి ఉందన్నారు. పాశ్చాత్య దేశాలది దోచుకునే విధానమని, దీనిని మనం అనుసరించరాదన్నారు. దీని వలన విచక్షణా రహితంగా వనరుల వినియోగం జరిగి తీవ్ర నష్టం ఏర్పడుతుందన్నారు. ప్రకృతి మన అవసరాలు తీరుస్తుందని దురాశను తీర్చదన్నారు. ప్రకృతిని అర్థం చేసుకోవడం, గౌరవించడం, సంరక్షించుకోవడం ఎంతో అవశ్యమన్నారు. ఈ సందర్భంగా సదస్సు సంచికను ఆయన విడుదల చేశారు. ఓమిక్స్ పబ్లిషింగ్ గ్రూప్ సిఈఓ డాక్టర్ గేదెల శ్రీనుబాబు మాట్లాడుతూ బయోటెక్నాలజీ, వైద్య రంగాలు గణనీయమైన ప్రగతిని సాధిస్తున్నాయన్నారు. భవిష్యత్ అవకాశాలకు అనుగుణంగా అవసరమైన సాంకేతికతలను అభివృద్ధి చేయడం ఎంతో అవసరమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న సాంకేతిక ఆవిష్కరణలు, పరిశోధనల ఫలితాలను యువతరం ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. తమ సంస్థ వెయ్యికిపైగా శాస్త్రసంబంధ జర్నల్స్‌ను, అంతర్జాతీయ స్థాయిలో సాంకేతిక సదస్సులను నిర్వహిస్తోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రవేత్తలను ఒకే వేదికపై తీసుకువచ్చి విజ్ఞానాన్ని అందిరికీ పంచే బృహత్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. విశాఖతో త్వరలో లైఫ్‌సైన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను తాము ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. దీనితో లైఫ్ సైన్సెస్‌లో పీజీ కోర్సులు చేసిన వారికి అవసరమైన శిక్షణ అందిస్తామన్నారు. ఐటి రంగానికి ధీటుగా లైఫ్‌సైన్సెస్ రంగాన్ని తీర్చిదిద్దడం తమ లక్ష్యమన్నారు. వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు మాట్లాడుతూ జీవం ఉన్నంత వరకు బయోటెక్నాలజీ అవసరం ఉంటుందన్నారు. నేడు ప్రకృతిని దోచుకోవడం జరుగుతోందన్నారు. దీనిని పరిరక్షించడం ప్రధమకర్తవ్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పర్యావరణ సంబంధిత సమస్యలకు బయోటెక్నాలజీ నిపుణులు పరిష్కారాలు చూపాలన్నారు. అభివృద్ధి జరిగే క్రమంలో కాలుష్యం పెరుగుతోందని, దీనికి అడ్డుకట్ట వేయాలని సూచించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావు మాట్లాడుతూ ముందుగా మన మనసులను మలిన రహితంగా తయారు చేసుకోవాలన్నారు. గ్రీన్ ఫ్యూచర్‌ను అందించడం ఎంతో అవసరమన్నారు. ఎమ్మెల్సీ పి.వి.ఎన్ మాధవ్ మాట్లాడుతూ నగరం ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలకు నిపుణులు పరిష్కారాలు సూచించాలన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్ అవధాని అద్యక్షత వహించారు.కార్యక్రమంలో ఐఐపిఇ సంచాలకులు ఆచార్య వి.ఎస్.ఆర్.కె ప్రసాద్, ఇండియన్ ఎకనామిక్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ఎగ్జిక్యూటివ్‌వైస్ ప్రెసిడెంట్ హెన్‌డ్రికస్ వాన్ డాం కన్వీనర్ ఆచార్య డి.శ్రీరామి రెడ్డి , ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎన్.ఎం యుగంధర్,విభాగాధిపతి ఆచార్య ఎస్.వి నాయుడు, కోశాధికారి డాక్టర్ సి.హెచ్ ఆశాఇమ్మానియల్ రాజు, విభాగ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## గీతంలో రక్షణ పరిశోధనా సంస్థ

# 'డ్రూన్' కార్యక్రమం

విశాఖపట్నం : భారత ప్రభుత్వ రక్షణ పరిశోధనా సంస్థ డిఅర్‌డిఓ వజ్రోత్సవాల సందర్భంగా దేశంలోని ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులకు (డిఆర్‌డిఓ) రోబోటిక్స్ అండ్ అన్ మ్యాన్డ్ సిస్టమ్స్ ఎక్స్‌పోజిషన్ డ్రూన్ పేరిట అవగాహనా కార్యాక్రమాలను నిర్వహిస్తోందని డిఆర్‌డిఓ శాస్త్రవేత్తలు డాక్టర్ సి.రామరాజు ,బి.వి.గౌతమ్ తెలిపారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో గురువారం జరిగిన కార్యక్రమంలో డిఆర్‌డిఓ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. పర్వతాలు అధిరోహించడం, మంచు పర్వతాలలో రక్షణదళాలకు సహాయ పడటంలో ఉపయోగపడే మానవ రహిత యుద్ధ సామగ్రి, రోబోలను తయారుచేయిడాన్ని డిఅర్‌డిఓ ప్రోత్సాహిస్తోం దన్నారు. అలాగే విద్యార్దులకు వివిద అంశాలలో నిర్వహిస్తున్న పోటీలను వివరించారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.ధర్మరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎమ్ఆర్ఎస్ సత్యానరాయణ తదితరులు పాల్గొన్నారు.

## అరకులోయలో

# నేడు సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

అరకులోయ: పర్యాటక కేంద్రమైన అరకులోయ పట్టణంలో వేంచేసియున్న శ్రీ యల్లారమ్మతల్లి ఆలయం వద్ద వున్న శ్రీసుబ్రహ్మణ్యస్వామి దేవాలయం వద్ద శుక్రవారం శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి సందర్భంగా అరకులోయ ఆలయం వద్ద స్వామి వారి కల్యాణం మహోత్సవాన్ని అత్యంత ఘనంగా కన్నుల పండువగా జరుపుతున్నట్లు ఆలయ వ్యవస్థాపకురాలు శాంతమ్మతల్లి తెలిపారు. ఉదయం జరిగే కల్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆమె కోరారు. స్వామి వారి కల్యాణం అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అన్న ప్రసాదాలు స్వీకరించాలని ఆమె కోరారు. ఉదయం ఆరుగంటల నుండి భక్తులు స్వామివారికి అభిషేకాలు జరుపుకోవచ్చునని ఆమె తెలిపారు. భక్తులు తమ సహాయ సహకారాలు అందివ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## గీతంలో 24 నుండి

# సిఎస్ఐ విద్యార్థి విభాగం రాష్ట్ర సమావేశాలు



గీతం యూనివర్శిటీః కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సిఎస్ఐ) గీతం విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నవంబర్ 24, 25 తేదీలలో రాష్ట్ర స్థాయి సమావేశాలను నిర్వహిస్తున్నట్లు సిఎస్ఐ రాష్ట్ర విద్యార్థి విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ పి.ఇ.ఎస్.కృష్ణ ప్రసాద్ తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి దాదాపు రెండు వేల మందికిపైగా విద్యార్థి ప్రతినిధులు ఈ సమావేశాలకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఎంబ్రేసింగ్ డిజిటల్ ట్రాన్స్ ఫార్మేషన్ పేరిట ఈ ఏడాది సమావేశాలను నిర్వహిస్తున్నామని సమావేశాలలో భాగంగా నిపుణుల పర్యవేక్షణలో సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, వర్చువల్ రియాలిటీ అనే అంశాలపై వర్కషాప్‌లు ఏర్పాటు చేస్తున్నామని అలాగే కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానంపై క్విజ్ పోటీలను, సాంకేతి చర్చలను నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశాలను కంట్రోల్ ఎస్ సంస్థ డైరక్టర్ ఆర్.ఎస్. ప్రసాదరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశాలలో పాల్గొనడానికి ఆసక్తి గల విద్యార్థులు గీతం విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www.gitam.edu/csiconvention ద్వారా పేర్లను నమోదు చేయించుకోవచ్చునని సూచించారు.

## గీతం వేదికగా

# అఖిల భారత స్థాయి టెన్నిస్ పోటీలు

సాగర్‌నగర్: అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ పర్యవేక్షణలో జరిగే అంతర విశ్వవిద్యాలయాల మహిళ టెన్నిస్ టోర్నమెంట్‌కు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆతిథ్యం ఇవ్వ మన్నదని సోర్ట్స్ బోర్డు కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 2 నుంచి 4వ తేదీ వరకు దక్షిణాది రాష్ట్రాలలోని విశ్వవిద్యాలయాలకు దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తామని, జనవరి 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు అఖిల భారత స్థాయిలో దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలను మహిళా టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లకు సంబం ధించిన రిజిస్ట్రేషన్లు, ఫిక్సర్‌ల సమాచారాన్ని గీతం విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ నుంచి పొందవచ్చునని పేర్కొన్నారు.

# అద్దె వాహనాలను రద్దు చేయాలి

## ప్రభుత్వ డ్రైవర్ల సంఘం డిమాండ్



విశాఖపట్నం : బ్రిటీష్ కాలం నుండి వస్తున్న డ్రైవర్ల వ్యవస్థకు రాష్ట్ర ప్రభుత్వం తూట్లు పొడవడం మంచి విధానం కాదని అద్దె వాహనాలను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం గౌరవ అధ్యక్షులు, ప్రభుత్వ డ్రైవర్ల మ్యూచువలీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ ఛైర్మన్ జి.శ్రీరాములు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయ కాంపౌండ్, మహారాణిపేటలోని ప్రభుత్వ డ్రైవర్ల సంఘం కార్యాలయ మొదటి అంతస్థులో కొత్తగా నిర్మించిన శ్రీరాములు భవనం సమావేశ మందిరాన్ని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రుద్ర శివరామ కృష్ణరాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జి.శ్రీరాములు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు కుటుంబ సభ్యుల పేరిట వాహనాలను కొనుగోలు చేసి వాటిని అద్దెకిస్తూ నెలకు 35వేల రూపాయలు తీసుకుంటున్నారని రాష్ట్రంలో ఇటువంటి అద్దె వాహనాలు 3వేల వరకు ఉన్నాయని చెప్పారు. ఈ ప్రక్రియను తాము వ్యతిరేకించగా ఐదుగురు ఐఏఎస్ అధికారులతో ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ ఇంతవరకు ఫలితం రాలేదని చెప్పారు. ఖరీదైన ఫైళ్లు, జెరాక్స్‌ల ద్వారా అద్దె వాహనాల్లో బయటకు పోతున్నాయని దీనివల్ల ప్రభుత్వ ప్రతిష్ట మంటగలుస్తోందని అన్నారు. రాష్ట్రంలో డ్రైవర్ల పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ ఇంతవరకు భర్తీ చేయలేదని చెప్పారు. అద్దె వాహనాలను రద్దు చేసి బ్రిటీష్ కాలం నుండి ఉన్న డ్రైవర్ల వ్యవస్థను కొనసాగించాలంటూ త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని నెరపనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ డ్రైవర్లకు ప్రభుత్వం ఇళ్లస్థలాలు కేటాయించినప్పటికీ నేటివరకు ఆ స్థలాలు తమ చేతికి అందలేదన్నారు. న్యాయస్థానంలో కేసు ఉందన్న సాకుతో ప్రభుత్వం ఇళ్లస్థలాలకు క్లియరెన్స్ ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. వాగ్ధానాలతో ప్రభుత్వం నడుస్తోంది తప్ప ఇళ్లనిర్మాణానికి తమకు అనుమతి ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. 2009 ఫిబ్రవరిలో రాష్ట్రంలోని 42 సొసైటీలకు అప్పటి ప్రభుత్వం ఇళ్లస్థలాలు కేటాయించిందని అయితే ఈ స్థలాల విషయమై కొందరు కోర్టును ఆశ్రయించారని, ఐఏఎస్‌లు, ప్రజాప్రతినిధుల విషయంలో తప్పు జరిగితే జరిగి ఉండొచ్చని, మిగిలిన సొసైటీల ఇళ్లస్థలాలను కేటాయించే విషయమై తాత్సారం చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో ఏపీఎన్జీవోల సంఘం మాజీ అధ్యక్షులు, రెవెన్యూ ఉద్యోగుల హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు పి.గోవర్ధనరావు మాట్లాడుతూ ప్రభుత్వ డ్రైవర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఇళ్లస్థలాలు, డ్రైవర్ల పోస్టుల భర్తీ ప్రధానమైనవని అన్నారు. ఏసీపీ రుద్ర శివరామకృష్ణరాజు మాట్లాడుతూ డ్రైవర్ల కష్టాలు ప్రభుత్వం తీర్చాలన్నారు. వీజేఎఫ్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ డ్రైవర్లు లేకపోతే పాలనే లేదని ఈ విషయాన్ని ప్రభుత్వం గమనించాలని కోరారు. వీఏజే సంఘం అధ్యక్షులు ఎం.ఆర్.ఎన్.వర్మ మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ సొసైటీలకు కేటాయించిన ఇళ్లస్థలాల్లో విశాఖపట్నం జర్నలిస్టుల ఇళ్లస్థలాలు కూడా ఉన్నాయని తాము స్థలాల విలువను చెల్లించినప్పటికీ ఇంతవరకు క్లియరెన్స్ లభించలేదని అన్నారు. ప్రభుత్వం తక్షణం సొసైటీల ఇళ్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో ది విశాఖపట్నం జిల్లా ఏపీ స్టేట్ గవర్నమెంట్ డ్రైవర్స్ మ్యూచువలీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌస్‌బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ వైస్‌ఛైర్మన్ జె.సత్యనారాయణ, సెక్రటరీ కె.త్రినాథరావు, డైరెక్టర్లు పి.ఎల్లయ్య, వై.సత్యనారాయణ, పి.శేషగిరిరావు, డి.వెంకట్రావు, కె.వీర్రాజు, పి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## భారత న్యాయమూర్తి

యూరోపియన్ దేశాల ప్రాబల్యం క్షీణిస్తున్నదనడానికి బ్రిటన్‌ను ఢీకొని భారత్‌కు చెందిన న్యాయమూర్తి అంతర్జాతీయ న్యాయస్థానానికి ఎన్నిక కావడం తాజా సూచిక. అంతర్జాతీయ న్యాయస్థానం ఏర్పడిన నాటి నుంచి ఏడు దశాబ్దాల చరిత్రలో బ్రిటన్ న్యాయమూర్తి ఒక్కరు కూడా లేకపోవడం ఇదే మొదటిసారి. అంతర్జాతీయ న్యాయస్థానానికి ఎన్నిక కావడానికి సర్వ ప్రతినిధి సభతోపాటు, భద్రతా మండలిలో కూడా మెజారిటీ సభ్యుల మద్దతు పొందవలసి ఉంటుంది. సర్వ ప్రతినిధిసభలో భారత్‌కు భారీ మద్దతు లభించింది. కానీ భద్రతా మండలిలో మాత్రం బ్రిటన్‌కు మెజారిటీ సాధించింది. పదకొండు విడుతలు ఓటింగ్ జరిగిన తరువాత కూడా దాదాపుగా ఇదే పరిస్థితి. సర్వ ప్రతినిధి సభలో అన్ని దేశాలకు సభ్యత్వం ఉంటుంది. అందువల్ల ప్రజాస్వామ్యబద్ధంగా ఆలోచిస్తే భారత్ ఎన్నికైనట్టు. అప్రజాస్వామిక విధానాలకు చిహ్నంగా మిగిలిపోయిన భద్రతా మండలిలో మెజారిటీని ఆధారంగా చేసుకొని, భారత్ సభ్యత్వానికి అడ్డుతగులడం బ్రిటన్‌కు మర్యాద కాదు. కానీ బ్రిటన్ అడ్డదారిలోనైనా గెలువాలని భావించింది. రెండు వేదికలలో ఏ ఒక్క దేశానికి మెజారిటీ రానప్పుడు, ఇరు సంస్థల నుంచి ముగ్గురేసి సభ్యులను ఎంపిక చేసి చర్చలు జరుపాలనే (ఉమ్మడి సమావేశం) పాత కాలపు నిబంధనను ముందుకుపెట్టింది. ఈ ప్రతిపాదనకు కూడా తగిన మద్దతు లభించకపోవడంతో చివరికి తమ అభ్యర్థిని ఉపసంహరించు కుంటున్నట్టు ప్రకటించింది. దీంతో భారత అభ్యర్థి జస్టిస్ దల్వీర్ భండారీ విజయం ఖరారయిపోయింది. భారత అభ్యర్థి ఎన్నిక ఉదంతం వర్ధమాన దేశాలు తమ శక్తి యుక్తులను చాటుకున్న తీరును వెల్లడిస్తున్నది. ఒకప్పుడు భద్రతా సమితిలో శాశ్వత సభ్యత్వం ఉన్న పెద్ద దేశాలు పరస్పరం సహకరించుకొని, బడుగు దేశాలను శాసించేవి. బడుగు దేశాలు పెద్ద దేశాలను ఎదిరించడానికి వెనుకాడేవి. కలిసికట్టుగా వ్యవహరించడానికి ధైర్యం చేసేవి కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి మారిం ది. బడుగు దేశాలు సర్వ ప్రతినిధి సభలో బ్రిటన్‌ను కాదని, భారత్‌కు మద్దతు ఇచ్చాయి. ఎన్నిక పద్ధతిలో ఎవరూ గెలువడం లేదంటూ, ఉమ్మ డి సమావేశం ద్వారా ఎంపిక పద్ధతిని అనుసరించాలని ప్రతిపాదించినప్పుడు బ్రిటన్ మద్ద తు లభించకపోవడానికి పెద్ద దేశాల బలహీనతే కారణం. అప్పటివరకు రహస్య ఓటింగ్‌లో బ్రిటన్‌కు మద్దతు ఇచ్చిన అమెరికా, ఫ్రాన్స్, రష్యా, చైనా బహిరంగ నిర్ణయం విషయానికి వచ్చేసరికి భారత్‌ను వ్యతిరేకించడానికి సంకోచించాయి. సర్వ ప్రతినిధి సభ తీర్పును బహిరంగంగా వ్యతిరేకిస్తూ, భద్రతా మండలి పెత్తనాన్ని ప్రదర్శించడం నైతికంగా సమర్థనీయం కాదనే భావన పెత్తందారీ దేశాలను పీడించిం ది. చైనాకు వ్యతిరేకంగా ఆసియా- పసిఫిక్ ప్రాంతంలో భారత్ మద్దతును కోరుకుంటున్న అమెరికా భారత్‌ను వ్యతిరేకించలేక పోయింది. ఇదేవిధంగా ప్రతి దేశానికీ తమకంటూ కారణా లు ఉన్నాయి. దీంతో బ్రిటన్ తోకముడువక తప్పలేదు. తమ అభ్యర్థిని ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించింది. ఒకప్పుడు ప్రపంచాన్ని శాసించిన బ్రిటన్ ఇప్పుడు ఒకప్పటి వలస దేశమైన భారత్‌పై గెలువలేక చతికిల పడ్డది. ఇది సాధారణ సంఘటన కాదనీ, బ్రిటన్ క్షీణతకు నిదర్శనమని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఐక్యరాజ్యసమితిని ప్రజాస్వామికీకరించాలని, భద్రతా మండలి ద్వారా సాగుతున్న ఐదు దేశాల పెత్తనం తొలిగించాలని చాలాకాలంగా వర్ధమాన దేశాలు కోరుతున్నాయి. రెండవ ప్రపం చ యుద్ధం ముగిసిన తరువాత అంతర్జాతీయ న్యాయ సూత్రాలు బలపడ్డాయి. ప్రచ్ఛన్న యుద్ధం మూలంగా రెండు శిబిరాలు బడుగు దేశాల మద్దతు కోసం ప్రయత్నించేవి. అయినప్పటికీ ఈ పరిస్థితిని ఉపయోగించుకొని తమ ప్రయోజనాలు కాపాడుకోవడంలో వర్ధమాన దేశాలు ఆశించిన రీతిలో సఫలం కాలేదు. వర్ధమాన దేశాలకు వేదికగా నిలిచిన అలీన ఉద్యమం నైతిక బలాన్నిచ్చిందే తప్ప, సంఘటిత శక్తిగా రూపు దిద్దుకోలేదు. కానీ ఐఎంఎఫ్ - ప్రపంచ బ్యాంకు విధానాలకు భిన్నంగా, తమ ప్రయోజనాలకు అనుగుణమైన కొత్త అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కావాలనే డిమాండ్‌తో ఏర్పడిన జి-77 కూటమి మాత్రం క్రమంగా బలపడుతూ ఐక్యరాజ్యసమితిలో తమ శక్తిని కొంత మేర నిరూపించుకుంటున్నది. ఇవి పరస్పరం సంఘీభావంతో వ్యవహరిస్తున్న నేపథ్యంలోనే, సర్వ ప్రతినిధి సభలో బ్రిటన్‌పై భారత్ విజయం సాధించగలిగింది. అయితే ఇప్పటికీ జీ- 7 దేశాల ప్రాబల్యాన్ని తక్కువగా అంచనా వేయలేం. వర్ధమాన దేశాలు ఏకతాటిపై నిలిచి అంతర్జాతీయ రాజకీయాలను శాసించడానికి ఇంకా చాలా పోరాడవలసి ఉం టుంది. ప్రాబల్య దేశాల ఆర్థిక, సైనిక, సాంకేతిక సంపత్తిని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటే సరిపోదు.

## అవసరం గుర్తించారు... మరుగుదొడ్డి నిర్మిస్తున్నారు

### నట్టింట్లోనే మరుగుదొడ్డి నిర్మించి గ్రామీణ సమాజానికి ఆదర్శంగా నిలిచిన ఓ రైతు



విజయనగరం : మనిషి ఎంతటి కార్యం సాధించడానికైనా, ఎలాంటి పట్టుదల కలిగించేందుకైనా అవసరమే ప్రేరణ కలిగిస్తుంది. దీనికి ఎవరూ అతీతం కాదు. ఏదైనా అంశంపై పూరిస్థాయి అవగాహన ఏర్పడి అది తనకు, తన కుటుంబానికి అత్యంత ఆవశ్యకమని గుర్తిస్తే దానిని నెరవేర్చుకోడానికి ఎంత కష్ట నష్టాలైనా ఎదుర్కొని తన అవసరాలు తీర్చు కుంటారు. చీపురుపల్లి మండలంలోని రైతు పల్లె రామ్మూర్తి కూడా దీనికి అతీతం కాదు. మండలంలోని ఓ కుగ్రామం పుర్రేయవలస. వ్యవసాయమే జీవనాధారంగా చేసుకుని ఇదే గ్రామంలో ఎన్నో ఏళ్లుగా నివసిస్తోంది రైతు పల్లె రామ్మూర్తి కుటుంబం. ప్రతి కుటుంబానికి ఇళ్లు అవసరం కాబట్టి గ్రామంలో తనకున్న కొద్దిపాటి స్థలంలో తనూ ఒక చిన్న పక్కా ఇంటిని నిర్మించుకున్నారు. నిరక్షరాస్యుడైన రామ్మూర్తికి తాను ఇళ్లు నిర్మించుకొనే సమయంలో మరుగుదొడ్డి అవసరం గురించి తగిన అవగాహన లేకపోవడంతో ఆ సమయంలో మరుగుదొడ్డి నిర్మించ లేకపోయారు. ఇంటి గచ్చులకు టైల్స్ వేసి నిర్మించుకున్నప్పటికీ ఆ ఇంటికి మరుగుదొడ్డి లేని లోటు ఆయనకు తర్వాతి కాలంతో తెలిసివచ్చింది. తన భార్య, వయసుకు వచ్చిన ఆడపిల్లలు ఆరుబయట మలవిసర్జనకు వెళ్లడంలో ఇబ్బందులు పడటంతో మరుగుదొడ్డి అవసరం తెలిసివచ్చింది. జిల్లా యంత్రాంగం తరపున ఎంపిడిఓ, ఇ.ఓ.ఆర్.డి. తదితర మండలస్థాయి అధికారులు గ్రామంలో బహిరంగ మల విసర్జన వల్ల అనర్థాలపై అవగాహన కలిగించడం, ప్రభుత్వం మరుగుదొడ్డి నిర్మాణానికి ప్రోత్సాహకంగా రూ.15 వేలు ఇస్తోందని రైతు రామ్మూర్తి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా నవంబరు 21న పెద్ద ఎత్తున మరుగుదొడ్ల నిర్మాణం ప్రారంభం అవుతుందని, అదేరోజున నిర్మాణం ప్రారంభించాలని రైతుకు సూచించారు. అయితే మరుగుదొడ్డి నిర్మించేందుకు ఇంటి బయట తనకు స్థలం లేకపోవడంతో నిర్మాణంపై సంశయంలో పడ్డారు. ఇంతకుమించిన అవకాశం మళ్లీ రాదని భావించిన అతని కుటుంబసభ్యులు ఎదోవిధంగా మరుగుదొడ్డి నిర్మించాలని నిర్ణయించారు. దీంతో ఇంటి లోపలే మరుగుదొడ్డి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. టైల్స్ తొలగించి గచ్చు తవ్వి ఇంట్లోనే నవంబరు 21న మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టారు. ఇంట్లోనే మరుగుదొడ్డి కోసం గుంతను తవ్వారు. మరుగుదొడ్డికి అవసరమైన సామాగ్రిని సమకూర్చుకొని చకచకా నిర్మాణం చేపడుతున్నారు. నిరక్షరాస్యత వున్నా అవగాహన కల్పిస్తే చైతన్యవంతులై వాటిని ఆచరించడంలో విజయనగరం ప్రజలు ఎల్లప్పుడూ ముందుంటారని, గ్రామీణ సమాజంలో చైతన్యానికి నిదర్శనంగా నిలుస్తున్నారు రామ్మూర్తి. గ్రామీణుల్లో పారిశుద్ధ్యంపై కలిగిన చైతన్యం బహిరంగ మలవిసర్జనలేని జిలాగా రూపొందించడంలో ముందుకు నడిపిస్తున్నాయి. రామ్మూర్తి ప్రేరణతో జిల్లాలోని మరుగుదొడ్డి లేని కుటుంబాలన్నీ వాటిని నిర్మించుకొంటే స్వచ్ఛ విజయనగరం రూపు దిద్దుకోవడం ఎంతో దూరంలో లేదు.

### మైక్యూర్ ఆసుపత్రి నందు

## ప్రీమెట్యూరీటీ పిల్లల తల్లితండ్రులతో మహా సదస్సు



విశాఖపట్నం : ప్రపంచ ప్రిమెట్యూరీటీ నెల సందర్భంగా జగదాంబ జంక్షన్ దరి మైక్యూర్ ఆసుపత్రి ఆవరణలో ప్రముఖ నియోనాటాలజిస్ట్ డాక్టర్ సాయి సునీల్ కిషోర్ మాట్లాడుతూ నెలలు నిండకుండా జన్మించిన నవజాతి శిశువులను ఉద్దేశించి మహా సదస్సును తమ ఆసుపత్రి నందు ఏర్పాటు చేసారు. దీనికి విశాఖ పట్నం మరియు పరిసర జిల్లాలకు చందిన సుమారు 20 మంది చిన్నారులు తమ తల్లితండ్రులతో హాజరై గొప్ప అనుభూతిని పొందారు. తమ వద్ద వైద్యం అందుకున్న చిన్నారులను ఈ విధంగా కలుసుకొన్నందుకు చాల సంతోషకరంగా ఉందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. తమ ఆసుపత్రిలో వైద్యం అందుకున్న సుమారు 550 గ్రాముల పసిపిల్లలు సైతం ప్రస్తుతము సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు . దీనికి కారణం తమ ఆసుపత్రిలో గల అత్యాధునిక వైద్య పరికరాలు ఒక వంతు అయితే నెలలు నిండకుండా పుట్టు పిల్లల తల్లితండ్రుల యొక్క కృషి, అవగాహనా మరియు తమపై ఉన్న నమ్మకం మరోవంతని ఈ బిడ్డల తల్లి తండ్రులకు అయన ప్రత్యేక కృతజయతలు తెలిపారు.

ఈ సభలో చంటిపిల్లల స్పెషలిస్ట్ డాక్టర్ జి. రమ, డాక్టర్ అనిత త్రిపాటి మరియు ఆసుపత్రి అధ్యక్షుడు సుఖేష్ రెడ్డి మరియు పద్మజలు పాల్గొని ప్రస్తుత కాలంలో అనేక కారణాల వల్ల ప్రిమెట్యూరీటీలో జన్మించే పసిపిల్లలకు సరిఅయిన వైద్య సేవలను అందించి నవజాతి శిశువుల జీవితాలలో వెలుగులు నింపేందుకు మైక్యూర్ ఆసుపత్రి వారు ఎప్పుడూ తమ వంతు కృషిని అందిస్తారని తెలిపారు.

## చేదెక్కిన చెరకు రైతు బ్రతుకులు...



చోడవరం: వాతావరణంలో ప్రతికూల పరిస్దితులు, మద్దతు ధరకు సహకరించని సహకార చక్కెర కర్మాగారాల పనితీరుతో చెరకు రైతాంగం పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయాడు. చెరకు సాగు గిట్టుబాటు కావడం లేదు. చెరకు పంట అంటేనే రైతాంగం వణకిపోతున్నారు. గత ఏడేళ్లుగా చెరకు సాగు విస్తీర్ణం తగ్గిపోతూనే ఉంది. ఏడేళ్ల క్రితం 40,121 హెక్టార్లలో చెరకు సాగు చెయ్యిగా ప్రస్తుతం 31 వేల హెక్టార్లకు పడిపోయింది. చెరకు సాగు చేస్తున్న రైతాంగంలో 40 శాతం వరకు బెల్లం తయారు చేస్తారు. ప్రస్తుతం బెల్లం సీజను ప్రారంభమైంది. కార్సితోటలు పక్వానికి వచ్చాయి. కొందరు చెరకు గానుగాడి బెల్లం తయారు చేస్తున్నారు. సీజను ప్రారంబంలో రంగు బెల్లానికి పదికిలోలు రూ.410 పలికేది. ఇప్పడు రూ.350కు మించడంల లేదు. నాసిరకాలు అయితే రూ.300లు లోపే ధర పలుకుతోంది. పసుపు ఆకు తెగులు కారణంగా దిగుబడులు గణనీయంగా పడిపోయాయి. ఈ తెగులు సోకి ఐదేళ్లు కావస్తున్నా దీని నివారణకు మన నేటివరకు మన శాస్త్రవేత్తలు ఎటువంటి క్రిమి సంహారక మందులు కనుక్కోలేకపోయారు. పంట మార్పి చేసుకోవాలంటూ ఉచిత సలహాలు మాత్రమే అంద జేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న అన్ని చెరకు రకాలు పసుపు ఆకు తెగులుకు గురవుతున్నాయి. మద్దతు ధర ఊసెత్తని సహకార చక్కెర ఫ్యాక్టరీల పనితీరుతో చెరకు పండించే రైతాంగం, పెట్టుబడులు రాక ఏటా అప్పుల్లో కూరుకు పోవలసి వస్తోంది. చేసిన అప్పులు తీర్చలేక, పూర్వం నుండి వస్తున్న పంటను విడవ లేక నానా పాట్లు పడుతున్నారు.

## కవి సమయం

### శ్రీకృష్ణ దేవుడు

అదిగదిగో దేవుడు
శ్రీ కృష్ణ దేవుడు
సర్వ మంతా వున్నాడు.
పరమాత్ముని తలచుటయే పుణ్యమైన దినమని
ప్రతి దినము పరమావది మీరని
గోవర్ధన గిరినెత్తి-భయమన్నది పోగొట్టి
వెతలు మోత మోసిరి- ప్రజలు చెంత నిలిచిరి
క్షణమంత పిలుపుతో - సాయమెంతో వుందని
శ్రమజీవన సాధనలో - సర్వజీవ రాసివి;
కొరత లేని జీవనం - ప్రతి ప్రాణికి ప్రాప్తివి.
పాడగా పాటయందు
ఆడగా ఆటయందు
పనిపాటులు యందును
చిత్తం, శరణం అనుకొని
లేనిదంటు తీరెను
ఉన్నదెంతో యిచ్చెను
విశ్వమంత దివ్యము - దివ్యమైన తేజము.

కవిత రచన :
మజ్జి శ్యామసుందరరావు
సెల్ నెం: 9290839512

## పంచాంగం

మాసం : మార్గశిర; తిథి : షష్ఠి తె.3.16; ఉత్తరాషాడ ఉ.7.12; ఉ.వ. 11.33ల 1.17.

శుక్రవారం 24-11-2017

**మేషం** : అయినవారితో ఉల్లాసంగా గడుపుతారు. నిరుద్యోగులకు ఉపాధి పథకాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఆలయాలను సందర్శిస్తారు.భాగస్వామిక చర్చలు, సంప్రదింపులకు అనుకూలం. స్త్రీలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. శాస్త్ర రంగాల వారికి పరిశోధనలు, ప్రయోగాలకు మంచి గుర్తింపు లభిస్తుంది. మీ వాహనం, విలువైన వస్తువులు జాగ్రత్త. గృహ నిర్మాణాలు, మరమ్మతులకు అనుకూలం. **వృషభం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ఉద్యోగస్తులు సమర్థంగా పనిచేసి పై అధికారులను మెప్పిస్తారు. ఒక కార్యం నిమిత్తం ఆకస్మికంగా ప్రయాణం చేస్తారు. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. **మిథునం** :ఎల్ఐసి, పోస్టల్ ఏజెంట్లు, రిప్రజెంటేటివ్‌లు టార్గెట్‌లను అధిగమిస్తారు. ఉపాధ్యాయులకు, రిప్రజెంటేటివ్‌లకు సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు ఆరోగ్యంలో అధికమైన జాగ్రత్త అవసరం. **కర్కాటకం** : స్థిరాస్తుల అమ్మకానికై చేయు యత్నాలు వాయిదాపడతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో అప్రమత్తత అవసరం. విద్యార్థులకు మిత్రబృందాలు, వ్యాపకాలు అధికం కాగలవు. దీర్ఘ కాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కామవుతాయి. అంతగా పరిచయం లేని వ్యక్తులకు దూరంగా ఉండటం మంచిది. **సింహం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపా రాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కాన వస్తుంది. **కన్య** : ధనసహాయం చేసే విషయంలో అప్రమత్తత అవసరం. దైవ దర్శనాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఉద్యోగస్తులు ఓర్పు, నేర్పుతో విజ యాన్ని సాధించగలరు. మధ్యవర్తిత్వం వహించటం వల్ల మాటపడక తప్పదు. మార్కెటింగ్ రంగాల్లో ఒత్తిడి పెరుగుతుంది. పాత వస్తువుల వల్ల ఇబ్బం దులు తలెత్తుతాయి. **తుల** : నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిల దొక్కు కుంటారు. జీవితభాగస్వామి ద్వారా ఆర్థిక లాభం పొందుతారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సామాన్యం. ప్రముఖుల కలయిక వల్ల ఆశించిన ఫలితం ఉంటుంది. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు, బిల్డర్లకు స్వీయ పర్యవేక్షణ ముఖ్యం. **వృశ్చికం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంత రంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారి తీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. కొంతమంది మీ నుంచి ధనం లేక ఇతత్రా సహాయం ఆర్థిస్తారు. ముఖ్యుల రాకపోకలు అధికం అవుతాయి. **ధనుస్సు** : వృత్తి వ్యాపా రులకు అన్నివిధాలా అనుకూలం. కీలకమైన సమస్యలు పరిష్కారం కావటంతో మీలో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. కుటుంబీకుల కోరికలు తీరుస్తారు. చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. భాగస్వామిక చర్చల్లో మీ అభిప్రాయాలకు ఆమోదం లభిస్తుంది. ఉద్యో గస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. **మకరం** : ఒక కార్యం నిమిత్తం ప్రయా ణం చేస్తారు. పత్రికా సంస్థలలోని వారికి ఊహించని సమస్యలెదురవుతాయి. దంప తుల మధ్య చిన్న చిన్న కలహాలు, చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. డాక్టర్లు అరుదైన చికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. సభలు, సమావేశాల్లో చురుకుగా పాల్గొంటారు. **కుంభం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. **మీనం** : విద్యార్థులు మాన సికంగా స్థిమిత పడతారు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అను కూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది.

## పరమ పవిత్రం... కేదారం

### సంకీర్తన



పరమేశ్వరుని సన్నిధానాల్లో పరమ పవిత్రమైనది కేదార్‌నాథ్ మహాక్షేత్రం. హిమగిరుల్లో నెలకొన్న ఈ క్షేత్రం ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటిగా యుగయుగాలుగా వెలుగొందుతోంది. భక్తుల పూజలు అందుకుంటోంది. రుద్రహిమాలయ పర్వత ప్రాంతాల్లోని ఈ క్షేత్రాన్ని దర్శించుకునే భక్తులు చాలా శ్రమించాల్సి వుంటుంది. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రుద్రప్రయాగ్ జిల్లాలోని పర్వతాల్లో పరమశివుడు కేదారేశ్వరుడిగా భక్తులకు దర్శన మిస్తారు. శీతాకాలంలో ఆలయాన్ని పూర్తిగా మూసివేస్తారు. వేసవి కాలం ప్రారంభంలోనే ఆలయాన్ని తెరవడం సంప్రదాయంగా వస్తోంది. మందాకిని నది జన్మస్థానం కూడా కేదార్‌నాథ్ సమీప పర్వతాల్లోనే వుంది.

**స్వయంభువుగా శివుడు..**

పరమశివుడు ఇక్కడ స్వయంభువుగా భక్తులకు అనుగ్రహాన్ని ప్రసాదిస్తుంటాడు. ద్వాపరయుగంలో కురుక్షేత్ర యుద్ధం అనంతరం పాండవులు విజేతలుగా నిలుస్తారు. అయితే యుద్ధంలో తమ సొంత దాయాదులను చంప వలసివచ్చినందుకు ఎంతగానో వేదనకు గురవుతారు. తమ పాపాల నుంచి విముక్తి పొందేందుకు మహేశ్వరుని దర్శనం కోసం హిమాలయాలకు చేరుకుంటారు. ఈశ్వరుడు వృషభరూపంలో కేదారం వద్ద వుండటాన్ని పాండవులు గమనిస్తారు. వారు వచ్చేలోగా శివుడు భూమిలోకి వెళ్లిపోతాడు. పాండవులకు మోపురం మాత్రమే దర్శనమిస్తుంది. ఆ దర్శనంతో పాండవులకు పాప విముక్తి కలుగుతుంది. భూమిలోకి వెళ్లిన పరమేశ్వరుని ముఖ భాగం నేపాల్‌లోని పశుపతినాథ్ ఆలయంలో వున్నట్టు పురాణాలు పేర్కొంటున్నాయి. మధ్యమహేశ్వర్, తుంగ్‌నాథ్, రుద్రనాథ్, కల్పేశ్వర్, కేదార్‌నాథ్... ఈ ఐదింటిని పంచ కేదార్‌నాథ్ క్షేత్రాలుగా పేర్కొంటారు.

**ఆధ్యాత్మికశిఖరం**

మంచుకొండల్లోని కేదార్‌నాథ్ క్షేత్రానికి చేరుకోవడం అత్యంత శ్రమతో కూడుకున్న పని. కానీ శివానుగ్రహం భక్తుల్ని ఆ ఇబ్బందులనుంచి దూరం చేస్తుంది. ఇక్కడ ఆలయాన్ని పాండవులు నిర్మించారని తెలుస్తోంది. అనంతరం ఆదిశంకరాచార్యులు ప్రాచీన ఆలయానికి సమీపంలోనే ప్రస్తుతం మనం చూసే ఆలయాన్ని నిర్మించారు. ఎన్నో వందల సంవత్సరాలు మంచుతో కప్పబడిన మహాపుణ్యక్షేత్రం అనంతరం దర్శనమివ్వడం భగవద్ అనుగ్రహమే. ఆదిశంకరులు ఇక్కడి నుంచే కైలాసానికి చేరుకున్నట్టు ప్రాచీన గ్రంథాలు పేర్కొంటున్నాయి. ఆదిశంకరుల సమాధిని కూడా ఆలయ సమీపంలో దర్శించవచ్చు. మంచు కొండల నడుమ పెద్ద పెద్ద రాళ్లతో ఆలయాన్ని నిర్మించడం దైవానుగ్రహమని పెద్దలు చెబుతారు. ఆలయం ముందు భాగంలో కుంతీదేవి, పాండవులు, శ్రీకృష్ణ విగ్రహాలు వుంటాయి. అలయం ముందు నంది విగ్రహం వుంటుంది. ఆలయంలో పరమశివుడు సదాశివమూర్తిగా దర్శన మిస్తారు.



**కొండలనెక్కి... శ్రమను అధిగమించి..**

ఉత్తరాఖండ్‌లోని పవిత్రపుణ్యక్షేత్రాలైన కేదార్‌నాథ్, బద్రీనాథ్, యమునోత్రి, గంగోత్రిలను దర్శించుకోవడాన్ని చార్‌ధామ్ యాత్రగా పేర్కొంటారు. కేదార్‌నాథ్ ప్రయాణం క్లిష్టంగా వుంటుంది. రిషికేశ్ నుంచి గౌరీకుండ్ వరకు సులభంగా చేరుకోవచ్చు. గౌరీకుండ్ నుంచి గుర్రాలు, డోలీలు లేదా కాలినడక ద్వారా ప్రయాణించాల్సి వుంటుంది. హిమపాతంతో కూడిన ప్రతికూల వాతావరణంలో భక్తులు ప్రయాణించాలి. హెలికాప్టర్ సర్వీసులను ఉత్తరాఖండ్ ప్రభుత్వం కల్పించింది. కానీ ఈ ప్రయాణానికి ఖర్చులు ఎక్కువగా ఉన్నాయి. సముద్రమట్టానికి దాదాపు 3500 మీటర్ల ఎత్తులో వుండే కేదార్‌నాథ్‌ను చేరుకోవడంతో బడలిక మొత్తం ఎగిరిపోతుంది. ఆ నీలకంఠుని దర్శనంతో ఆధ్యాత్మిక అనుభూతి కలుగుతుంది.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# ఘనంగా సత్యసాయిబాబా జయంతి



అన్నదానంలో పాల్గొన్న చైర్ పర్సన్, వైస్ చైర్మన్‌లు

నర్సీపట్నం : నర్సీపట్నంలో సత్యసాయిబాబా జయంతి సందర్భంగా నర్సీపట్నంలోని శారదా నగర్ సత్యసాయిబాబా ఆలయం వద్ద భారీ ఎత్తున వేడుకలు నిర్వహించారు. నర్సీపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ చింతకాయల అనిత, వైస్ చైర్మన్ సన్యాసి పాత్రుడు (జమీలు)లు వేడుకల్లో పాల్గని భక్తులకు అన్నదానం, వస్త్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రేమ మూర్తి, మహి మాన్వితులు, కలియుగ దైవం భగవాన్ సత్య సాయి బాబా అన్నారు. ఆయన ఆశీస్సులు ఎల్లవేళలా కలగాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయిబాబా సేవా సమితి సభ్యులు, సత్య సాయిబాబా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ముమ్మరంగా వరి కోతలు

రోలుగుంట : వాతా ర ణం అనుకూలంగా ఉండ టంతో మండలంలో ముమ్మ రంగా వరి కోతలు జరుగుతున్నాయి. ముందుంగా వరినాట్లు వేసిన ప్రాంతాల్లో పంటలు కోతకు వచ్చాయి. దీంతో ఈ గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు డిమాండ్ ఏర్పడింది. కొందరు రైతులు ముందుగానే కూలి చెల్లించి తమ పొలం పనికి వచ్చేలా కూలీలతో ఒప్పందం చేసుకుంటున్నారు. మరికొంత మంది రైతులు ఏకంగా యంత్రాలతో పంటలను కోయిస్తున్నారు. దాదాపు మరో 10 రోజుల్లో వరి కోతలు పూర్తయ్యే అవకాశం ఉంది.

# షష్టి పూజలకు ఏర్పాట్లు

నర్సీపట్నం : ఈ నెల 25 నుంచి శ్రీషిర్డిసాయి ఆలయంలో శ్రీ సుబ్రహ్మణేశ్వరస్వామి వారి షష్టి పూజలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు షిర్డిసాయి సేవా సమాజ్ వారు తెలిపారు. శుక్రవారం తెల్లవారు జామున 4 గంటల నుండి మధ్యాహ్నం 11 గంటల వరకు ప్రతీ గంటకు ఒక బ్యాచ్ చొప్పున శ్రీసుబ్రహ్మణేవ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుపడం జరుగుతుదన్నారు. రాహుకేతువు దోషములు, కుజదోష, కాలసర్పదోషములు, వివాహ, సంతాన ప్రాప్తి, సర్వశుభముల కొరకు భక్తులు తమ గోత్ర నామములతో అభిషేకములు, అర్చనలు జరిపించుకొని శ్రీస్వామి వారి అనుగ్రహము పొంది తీర్ధ ప్రసాదములు స్వీకరించాలని కోరారు.

## వచ్చే నెల 10న
# గోవింద కల్యాణం

రావికమతం : వచ్చే నెల 10న కొత్తకోట ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న కేశవస్వామి ఆలయంలో గోవింద కళ్యాణోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఎంపిపి దంగేటి రామకృష్ణ, సర్పంచ్ కోటా నీలవేణి అన్నారు. ఈ మేరకు వారు విలేకరులతో మాట్లాడుతూ అన్నమాచార్య వాగ్దేయ పరదాయని ఆధ్వర్యంలో 101 మంది దంపతులతో ఈ కార్యక్రమం జరగనునందన్నారు. ఉత్సవానికి రావికమతం, రోలుగుంట, బుచ్చయ్యపేట మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు అవుతారన్నారు. ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ వేడుక విజయవంతానికి గ్రామస్థులు సహకరించాలని వారు కోరారు.

## రైతుల అభిష్టం మేరకే
# తాండవ నీరు నిలుపుదల



నీటిని పరిశీలిస్తున్న డిఈ రాజేంద్రకుమార్

నాతవరం : రైతుల అభిష్టం మేరకే తాండవ నీటి నిలుపుదల చేసినట్లు తాండవ డిఈ రాజేంద్రకుమార్ తెలిపారు. ఆయన తాండవ చైర్మన్ పారుపల్లి కొండబాబుతో కలిసి నాతవరం మండలంలో పార్వతీపురం, చెర్లోపాలెం, జిల్లేడుపూడి ప్రాంతాల్లో గల ఎడమ కాలువకు సమీపంలో ఉన్న వరి పంటలను పరిశీలించారు. ఇంకా తాండవ నీరు ఎన్ని రోజులు అవసరమని డిఈ రాజేంద్రకుమార్ రైతులను అడిగి తెలుసుకున్నారు. కొంత మంది రైతులు పది రోజులు తాండవ నీరు విడుదల చేస్తే సరిపోతుందని చెప్పగా మెట్ట ప్రాంత రైతులు మాత్రం డిసెంబరు 10వ తేదీ వరకు తాండవ నీరు విడుదల చేయాలని కోరారు. దీంతో రాజేంద్రకుమార్ మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలో కోటనందూరు మండలాల రైతుల అభిప్రాయాలను కూడా తీసుకొని తాండవ నీరు నిలుపుదల పై నిర్ణయం చేస్తామన్నారు. దీన్ని రైతులు అర్ధం చేసుకోవాలని ఆయన కోరారు.

# పుట్టిన రోజు వేడుకలకు వెళ్లి అదృశ్యమైన విద్యార్ధి



నక్కా దేవి ప్రసాద్

పెందుర్తి : ఊరులోనే పుట్టిన రోజు వేడుకలకు వెళ్లిన 10 ఏళ్ల విద్యార్ధి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన పెందుర్తి మండలం, సరిపల్లి గ్రామంలో జరిగింది. ఇదే గ్రామానికి చెందిన నక్కా అప్పారావు కుమారుడు నక్కా దేవి ప్రసాద్ (10 ) పెందుర్తి లో ఉన్నా అమర్ కాన్సప్ట్ స్కూల్లో 3వ తరగతి చదువు తున్నాడు. గ్రామంలోనే తన కుటుంబ సభ్యులు ఇంటిలో జరుగుతున్నా పుట్టిన రోజు వేడుకలకు దేవి ప్రసాద్ బుధవారం సాయింత్రం 6 గంటల సమయంలో వేళ్లాడు. రాత్రి 8 గంటలు కావస్తున్నా తన కుమారుడు ఇంటికి రాకపోయే సరికి తల్లి రాజమ్మ జరిగిన విషయాన్ని భర్త అప్పారావుకు ఫోను ద్వారా సమాచారం అందించి కుమారుడు కోసం అన్ని ప్రాంతాలలో గాలించారు. అయిన కుమారుడు ఆచూకి దొరకలేదు. దీనితో తల్లి తండ్రులు పెందుర్తి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసారు. సి.ఐ జె.మురళి కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

# జిల్లాలో ఒడిఎఫ్ అవార్డు నర్సీపట్నంకు రావాలి

## ఎంపీపీ సుకల రమణమ్మ



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నర్సీపట్నం : ఒడిఎఫ్ అవార్డును ముందుగా నర్సీపట్నం మండలం ముందుగా పొందాలని ఎంపిపి సుకల రమణమ్మ అన్నారు. ఐకెపి ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా వివిధ పాఠశాలల్లోనూ, గ్రామైఖ్య సంఘాలలో మరుగుదొడ్లపై చిత్ర లేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సదరు పోటీల్లో గెలుపొందిన వారికి ఐకెపి కార్యాలయంలో ప్రత్యేక సమా వేశాన్ని ఏర్పాటు చేసి బహు మతులను అంద జేశారు. నర్సీపట్నం జెడ్పీటీసీ చదల వాడ సువర్ణలత, ఎంపిడిఒ ఎన్.జయమాధవి, ఎంఇఒ సాయిశైలజ, ఆర్ డబ్ల్యూఎస్ జేఇ మల్లీశ్వరి, ఐకెపి ఏపిఎం సత్తిబాబు, ఎన్ఆర్ఇజిఎస్ ఏపిఒ సూర్యమణి, సీనియర్ టీడీపీ నాయకులు సుకల అప్పలనాయుడు పలు పాఠశాల నుంచి విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. జెడ్పీటీసీ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఆమె సూచించారు.

# గిరి రైతులకు చెక్కులు పంపిణీ

అరకులోయ : మండలంలో కాయగూరలు పండించే రైతులకు గురువారం చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపీపీ కె.అరుణకుమారి చేతుల మీదుగా వెలుగు ఎపిఎం రాజుబాబు గిరి రైతులకు చెక్కులు అందజేశారు. గురువారం లాంఛనంగా నాలుగు గ్రూపులకు ఒక్కో గ్రూపునకు రూ.10వేలు చొప్పున నాలుగు గ్రూపులకు ఎంపీపీ 40 వేల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎపిఎం రాజుబాబు మాట్లాడుతూ మండలానికి 5 లక్షల 54 వేలు రూపాయలు మంజూ రయ్యిందని ఈ మొత్తాన్ని గిరి రైతులకు అంద జేస్తామని ఆయన తెలిపారు. మన్యంలో అరకు లోయలో మాత్రమే మొట్టమొదటిసారిగా కూర గాయల రైతులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైందని ఆయన వివరించారు.

చెక్కుల పంపిణీ కార్యక్రమం పూర్తి అయ్యేవరకు కొనసాగుతుందని, వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెదలబుడు సర్పంచ్ ఎస్ గులాబి, టీడీపీ నాయకులు అప్పాలు, రఘునాథ్, రైతులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి
# అంతా కృషి చేయాలి



సింథియా: ఆరోగ్యవంత మైన సమాజ నిర్మాణానికి అంతా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి అన్నారు. జీవీయంసీ 48వ వార్డు బాపూజీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సెయింట్ ఆన్స్ జూబ్లీమెమెరియల్ హాస్పటల్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిభిరం ప్రారంభమైయ్యింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెందుర్తి మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంత ప్రజలకు సెయింట్ ఆన్స్ సంస్థలు అనేక సేవలు చేస్తున్నాయని అభినందించారు. పౌష్టికారాహంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. సెయింట్ ఆన్స్ సంస్థ నిర్వహించిన ఉచిత వైద్యశిభిరాన్ని స్థానికులు సద్వినియోగించుకోవాలని అన్నారు. అనంతరం వైద్యులు విజయకుమార్, హెలీనాలు రోగులను పరీక్షించారు. సుమారు 180 మంది రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం వారికి ఉచితంగా మందులను పంపిణీ చేసారు. అనంతరం మ్యాన్ కైండ్ ఫార్మా కంపినీ ఆధ్వర్యంలో ఉచితంగా మధుమేహ పరీక్షలు నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత, తల్లిపాల ఆవశ్యకత, పౌష్టికాహారం, కంటికి తీసుకోవలసిన జాగ్రత్తలు, తదితర అంశాలపై విద్యార్థినిలు స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెయింటన్స్ ఆసుపత్రి పరిపాలనాధికారి సిస్టర్ బిన్సీ, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపియస్ భాగ్యలక్ష్మి, వై. అనసూయ దేవి, మాజీ కార్పోరేటర్ పిల్లా కన్నబాబు, స్థానిక నాయకులు జీవియస్ఎన్ రాజు, నరేష్, హనుమంతరావు, న్యాయవాది రాజు తదితరులు పాల్గొన్నారు.

# మండల సర్వసభ్య సమావేశంకు అన్ని ఆటంకాలే

## అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

కొయ్యూరు : అధికారుల తీరుపై ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల సర్వసభ్య సమావేశం మరో మారు వాయిదా పడటంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆగస్టు 11న సమావేశం నిర్వహణకు ఏర్పాటు చేయగా అధికారుల లేకపోవడంతో వాయిదా వేశారని, బుధవారం కోరం లేదనే కారణంతో అదే పరిస్థితి ఎదురు కావడం దారుణమని సభ్యులు ఎంపిడిఒను నిలదీశారు. మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరుగుతుందని ఎంపిటిసి సభ్యులకు కార్య దర్శుల ద్వారా సమాచారం ఎంపిడిఒ అందించారు. దీంతో కొంత మంది నిర్దేశిత సమయానికి కార్యాలయానికి చేరుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటల వరకు ఎంపిపి, జెడ్పీటీసీ సభ్యుడు, మరో ఎంపిటిసి సభ్యుడు వచ్చారు. మిగిలిన 12 మంది ఎంపిటిసి సభ్యులు, కొంత మంది అధికారులు రాలేదు. దీంతో ఎంపిడిఒ ఇమ్మానుయేలు వచ్చిన సభ్యుల ఆమోదంతో సమావేశానికి 29వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం వచ్చిన ఎంపిటిసి సభ్యులు సమావేశం వాయిదాపై ఎంపిడిఒను నిలదీశారు. సమావేశ నిర్వహణపై ఖచ్చితమైన సమయం పొందు పరుస్తూ సమాచారం ఇచ్చారా.. అని అడిగారు. ఆరు మాసాలుగా సమావేశం నిర్వహించక పోవడంతో తమ పదవులకే ఎసరు పెట్టేలా ఉందని జెడ్పీటీసీ శ్రీరామూర్తితో పాటు మంప, డౌనూరు, రావణాపల్లి, బూదరాళ్ల, శరభన్న పాలెం, కొమ్మిక ఎంపిటిసి సభ్యులు మండి పడ్డారు.

## సంతకం ఫోర్జరీకి పాల్పడిన
# జూనియర్ అసిస్టెంట్ శ్రీనుబాబు సస్పెన్షన్

### ఉత్తర్వులు జారీచేసిన డి.ఎం.హెచ్.ఓ. డా.పద్మజ

విజయనగరం : కార్యాలయ సహాయకునికి (ఓ.ఎస్) ఆర్జిత శెలవుకు మంజూరుకు సంబంధించి జిల్లా వైద్యఆరోగ్య అదికారి సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఆ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ బి.శ్రీనుబాబును విధుల నుండి సస్పెండ్ చేస్తూ డి.ఎం.హెచ్.ఓ. డా.ఎస్.పద్మజ ఉత్తర్వులు జారీచేశారు. ఇదే కార్యాలయంలో ఓ.ఎస్.గా విధులు నిర్వహిస్తున్న డి.రామకృష్ణ దరఖాస్తు చేసుకోగా ఉన్నతాధికారి సంతకాన్ని జూనియర్ అసిస్టెంట్ ఫోర్జరీ చేసినట్టు ఫిర్యాదు అందిందని, దీనిపై వివరణ కోరుతూ ఆయనకు నోటీసు ఇచ్చినప్పటికీ ఆ ఉద్యోగి ఎలాంటి సమాధానం ఇవ్వలేదని, ఆయన ఫోర్జరీకి పాల్పడినట్లు నిర్ధారించి సస్పెండ్ చేస్తున్నట్టు తెలిపారు. డివిజన్ స్థాయి సమీక్ష సందర్భంగా జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ ఆయనపై ఏంచర్య తీసుకున్నారని డి.ఎం.హెచ్.ఓ.ను ప్రశ్నించారు. ఆయన సస్పెన్షన్ కోసం ప్రతిపాదనలు చేస్తున్నట్లు డి.ఎం.హెచ్.ఓ తెలిపారు. అదేవిధంగా జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఎముకల వైద్య నిపుణుడు శస్త్రచికిత్సలకోసం రోగుల నుండి డబ్బులు డిమాండ్ చేసినట్లు వచ్చిన వార్తలపై ఏం చర్య తీససుకున్నారంటూ కలెక్టర్ డి.సి.హెచ్.ఎస్. ఉషశ్రీని ప్రశ్నించారు. దీనిపై జిల్లా ఆససుపత్రి సూపరింటెండెంట్‌ను వివరణ కోరామని, ఆయన ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేనందున దీనిపై విచారణ అధికారిని నియమించ నున్నామని డి.సి .హెచ్.ఎస్ వివరించారు. చీపురుపల్లి ఆసుపత్రిలో మత్తుమందు వైద్యుడిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

## పంటి సమస్యలు పైన
# షుగర్ వ్యాధిగ్రస్తులు పలు జాగ్రత్తలు తీసుకోవాలి



మాధవధార : పంటి సమస్యలు పైన షుగర్ వ్యాది గ్రస్తులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీ సాయి నందిని డెంటల్ కేర్ అండ్ ఇన్‌ప్లాంట్ సెంటర్ అధినేత ప్రముఖ డెంటల్ నిపుణులు డాక్టర్ సునందిని తెలిపారు. కళింగనగర్ ఈస్ట్ పార్కు ఎదురుగా గురువారం శ్రీ సాయి నందిని డెంటల్ కేర్ అండ్ ఇన్‌ప్లాంట్ సెంటర్‌ను ముఖ్య అతిధు లుగా విచ్చేసిన బొబ్బిలి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ పోలా అజయ్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రొంగళి జగన్నాధంలు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సెంటర్ మరింత అభివృద్ధి కావాలని అకాంక్షిం చారు. ఈ సందర్భంగా డాక్టర్ సునందిని మాట్లాడుతూ అత్యాధునిత నూతన టెక్నాలజిలో పంటి సమస్యలను దూరం చేస్తున్నట్లు తెలిపారు. శీతాకాలంలో పంటి సమస్యల పైన పలు జాగ్రత్తలు వహించాలని అన్నారు. ముఖ్యంగా షుగర్ వ్యాది గ్రస్తులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవలసిన అవసరం ఎంతయిన ఉందని అన్నారు. అదేవిదంగా తమ సెంటర్ ద్వారా పేద ప్రజలు ఉండే ప్రాంతంలో ఉచితంగా వైద్య సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిత కింజరాపు, బర్ల అప్పలనారాయణ, ఆర్.పరదేశినాయుడు, మనోహర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రల్ ఫార్మశీ ప్రారంభం

విశాఖపట్నం: అన్ని రకాల ఆరోగ్య సేవలు ఒకేచోట లభించడం సంతోషకరమని జెడ్పీ ఛైర్‌పర్సన్ లాలం భవాని అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా గల లాలమ్స్ రాజా ప్లాజాలో ఏర్పాటు చేసిన సెంట్రల్ ఫార్మశీని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్వరాలు, చిన్న చిన్న రోగాలతో ఇబ్బంది పడే వారు ఒక్క రోజు లోనే తమ ఇంటికి సంతోషంగా చేరుకునేలా డే కేర్ మెడికల్ మేనేజ్‌మెంట్ సేవలను ప్రవేశపెట్టామన్నారు. సెంట్రల్ ఫార్మశీ మేనేజింగ్ డైరక్టర్లు డాక్టర్ రామమూర్తి, కె.రామారావులు మాట్లాడుతూ సెంట్రల్ ఫార్మశీలో అన్ని విభాగాల డాక్టర్లు, మందులు అందుబాటులో వుంటారని, పేదవారికి తక్కువ రేటుకే డయాగ్నొస్టిక్ సేవలను అందించనున్నట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో శోభన్‌బాబు, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అర్జున, గుడివాడ అమర్‌నాధ్, తిప్పల నాగిరెడ్డి, కొయ్య ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు ఇసుక లారీలు సీజ్



దేవరాపల్లి :మండలంలోని తిమిరాం శారదానది పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు లారీలను విజిలెన్సు అండ్ మైనింగ్ అధికారులు మెరుపు డాడీ చేసి పట్టుకున్నారు .తిమిరాం లో ఇసుక అక్రమంగా తరలిపోతుందని సమాచారం అందడంతో ఆధికారులు డాడీ చూసి స్థానిక పోలీసులకు అప్పగించారు .దీనిపై కేసు నమోదు చేస్తున్నట్టు విలేకరులకు తెలిపారు.

## మరుగుదొడ్ల నిర్మించకుంటే
# ప్రభుత్వ పథకాలు నిలుపుదల



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీధర్

కోటవురట్ల : మండల ప్రత్యేకాధికారి శ్రీధర్ రామచంద్రపాలెం పంచాయతీలోని మారుమూల గ్రామంలోని అల్లుమియ్యపాలెంలో మరుగుదొడ్లను తనిఖీ చేశారు. ప్రతీ ఒక్కరూ మరుగుదొడ్లు నిర్మించుకోవాలని అలా కాని పక్షంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేసే ప్రమాదం ఉందని గుర్తించాలన్నారు.

### నేడు శ్రీవల్లి దేవత సేన సుబ్రమణ్యేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం

రావికమతం : కొత్తకోట గ్రామంలో బ్రాహ్మణ వీధిలో వెలసిన శ్రీవల్లి దేవతసేన సుబ్రమణ్యేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం నేడు జరగనుంది. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు అనంతరం కళ్యాణ మహోత్సవం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

ఇళ్లు, అపార్ట్‌మెంట్, ఇళ్ల స్థలములు కొనాలన్నా, అమ్మాలన్నా, తనఖా, అన్ని రకముల లోన్ సదుపాయములు బ్యాంక్ ద్వారా సమకూర్చుటకు సంప్రదించగలరు.
79815 79817

**In the court of the Hon'ble Subordinate Judge, YANAM**
**IA No.: 172/2017. OS No.: 78/2015**

**Between**
**Maddimchetty Vijay Kumar and another ...Petitioners/Plaintiffs**
**and**
**Maddimchetty Suryakantham and Others ...Respondents/Defendants**
**To**
**R7 : Maddimchetty Rajeswary, W/o. NVSN Murthy, D.No. 10-5-2/1, Plot No.310, Mythri Towers, Ramnagar, Visakhapatnam.**
**R8 : Maddimchetty Nagarany, W/o.Ramayanam Sudhakar, D.No.4-4-39, Kaki Street, Yanam.**
**R9 : Maddimchetty Vyjayanthy, W/o.K.V.Ashokulu Naidu, D.No.4-4-39, Kaki Street, Yanam.**
**R10: Maddimchetty Sri Venkateswary, W/o. Perivala Nageswara Rao, D.No. 28/3/1, Durani Sandu, Mazid Street, KAKINADA. AP**

Please take notice that my clients/petitioners filed the above numbered petition to amend the plaint, against you and other-sand the same is posted for your appearanceon **8-12-2017.**
You are hereby requested to appear on 8**-12-2017 at 10.00 am** before the Hon'ble Court either in person or through your advocate, failing which the case will be decided in your absence.

**PENDYALA MALLESWARA RAO**
**GVL NARASIMHAM**
**BHAVARAJU SRINIVAS**
**Advocates, Kakinada**
**Cell : 94401 76301**

# చంద్రన్న బీమా పరిహారం అందచేత



భీమునిపట్నం ఎగువపేటకి చెందిన కాసరపు సత్తిరాజు గతంలో మృతిచెందాడు మృతిని కుంటుంబ సభ్యులకు పట్టణ టి.డి.పి. అధ్యక్షులు గంటా.నూకరాజు ఆయన బార్య కొండమ్మకు చెక్కు 25 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో పి.యోగి, కాసరపు.నాగరాజు, కనకల. అప్పలనాయుడు, వి.సత్యారావు, కె.ఎస్.ఆర్.కె.కృష్ణారావు, జి.పోలిరాజు, వి. కోదండ, దాసరి.వెంకటేష్ , చంద్రన్న భీమా ఏజెంట్ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బాడ్మింటన్ పోటీలో సాయి విద్యార్థుల ప్రతిభ

యానాం : స్పోర్ట్స్ అథార్టి ఆఫ్ ఇండియా (సాయి) ట్రైనింగ్ సెంటర్ విద్యార్థులు బాడ్మింటన్ పోటీలలో ప్రతిభ సాధించారు. ఇటీవల కాకినాడలో రెండు రోజుల పాటు జరిగిన స్పోర్ట్సు స్టూడెంట్స్ ఒలింపిక్ గేమ్స్ ఈనాడు చాంపియన్ షిప్ పోటీలో యానాం సాయి క్రీడాకారులు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. జి. మణితేజ అండర్ 14 సింగల్స్‌లో బంగారు పతకాన్ని, అండర్ 17 డబుల్స్ విభాగంలో వెండి పతకాన్ని గెలుచుకున్నారు. కె. వికాస్ అకిల్ అండర్ 19 డబుల్స్ విభాగంలో వెండి, అండర్ 22 విభాగం లో బెస్ట్ ప్లేయర్‌గా వెండి పతకాలను సాధించారు. ఇ. వేణుగోపాల్ అండర్ 19 సింగిల్స్‌లో వెండిపతకాన్ని డబుల్స్‌లో బంగారు పతకాలను సాధించారు. ఐ.పార్థసారధి ఆండర్ 19 విభాగంలో డబుల్స్‌లో గోల్డ్, బ్రాంచి మెడల్స్‌ను గెలుచుకున్నాడు. ప్రతిభ సాధించిన క్రీడాకారులను కోచ్ మహబూబా రాజాను సాయి ప్రతినిధి రాయుడు నాంచారీశ్వర్లు అభినందించారు.

# కబేళా తరలింపు మానుకోవాలి




విశాఖపట్నం : పౌర గ్రంధాలయంలో మటన్ మర్చంట్స్ ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిధిగా హాజరైన సంస్థ న్యాయసలహాదారుడు, రాష్ట్ర హైకోర్టు న్యాయవాది ఐ ఎం అహ్మద్ మాట్లాడారు. మటన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కిలాని వెంకట అప్పారావు మాట్లాడుతూ హనుమంతవాకలో ఉన్న మేకల కబేళాను స్మార్ట్‌సిటీ నెపంతో మారికవలసకు తరలించే ఆలోచనను తక్షణమే మానుకోవాలని ప్రభుత్వ అధికారుల్ని, ప్రజాప్రతినిధుల్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 33 ఏళ్ళుగా హనుమంతవాక ప్రాంతంలోనే కబేళా ఉందని, ఇంతకాలంగా లేని ఇబ్బంది ఇప్పుడేంటని ప్రశ్నించారు. స్మార్ట్‌సిటీ పేరుతో జీవితాలతో చెలగాటం ఆడొద్దన్నారు. నగరంలో సుమారు 700 షాపులు ఉన్నాయని వాటిద్వారా వేలాదిమంది జీవనం సాగిస్తున్నారని మారికవలసలో గొడ్లకు ఏర్పాటుచేసిన 11 ఎకరాలో విస్తర్ణలో మేకల కబేళాకు కేవలం అర ఎకరం కేటాయించారని గొడ్లతో కలిసి మేకలను నరకడం చేయడంవలన హిందువుల మనోభావాలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తంచేశారు. షాపుల వద్ద నరికితే జీవీఎంసీ అధికారులు రూ. 2000 జరిమానా విధిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శి అప్పలరాజు, కోశాధికారి చందకరవి, వైస్‌ప్రెసిడెంట్ షాన్‌భాషా, జాయింట్ సెక్రటరీ సంభారి శంకర్రావు అధిక సంఖ్యలో మాంసం వ్యాపారులు పాల్గొన్నారు.

# కుళ్లిన కోడిగుడ్లు సరఫరా

యలమంచిలి రూరల్ : యలమంచిలి పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు కుళ్లిన కోడిగుడ్లు సరఫరా అయ్యాయి. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ఈ కుళ్లిన కోడిగుడ్లు రావడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. కోడి గుడ్లు విద్యార్థులకు అందజేసేందుకు నీళ్లలో ఉడికించే సరికి గుడ్లన్నీ కుళ్లిపోయినట్లు తయారయ్యాయి. దీంతో సదరు ఉపాధ్యాయులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నారు. పట్టణంలోని మూడు ప్రభుత్వ పాఠశాలలకు కుళ్లిపోయిన కోడిగుడ్లు సరఫరా అయ్యాయి. ఇటీవల కాలంలో సరఫరా చేస్తున్న కోడి గుడ్లు తరచూ కుళ్లిపోతున్నాయని, వాటినే సరఫరా పాఠశాలలకు సరఫరా చేస్తున్నారని పలువురు అధ్యాపకులు అంటున్నారు. ఇకనైనా విద్యార్థులకు సరపరా చేసే కోడి గుడ్లను నాణ్యమైనవి సరపరా చేసేలా విద్యా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# 58వ రోజుకు చేరిన సెక్యూర్టీ గార్డుల దీక్షలు

తాళ్లరేవు : తమను ఉద్యోగులుగా కొనసాగించాలని కోరుతూ సెక్యూర్టీగార్డులు నిర్వహిస్తున్న నిరవధిక నిరాహార దీక్షలు 58వ రోజుకు చేరాయి పి. మల్లవరం పంచాయతీలో పరిధిలోని ఒఎన్‌జిసి ప్లాంట్ వద్ద 100 కుటుంబాల ఘోష పేరిట గత రెండు నెలలుగా ఆందోళన చేస్తున్నారు. తమ నిరాహార దీక్షలకు పలువురు మద్ధతు ప్రకటించినప్పటికీ సంస్థ అధికారులు మాత్రం స్పందించడంలేదని కార్మికులు వాపోతున్నారు. జిఎస్‌పిసి సంస్థను ఒఎన్‌జిసికి బదలాయించడం వలన తమకు ఈ పరిస్థితి తలెత్తిందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా ప్రజా ప్రతినిధులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

# సముద్ర తీరానికి కొట్టుకు వచ్చిన తాబేళ్లు



భీమునిపట్నం : భీమిలి సముద్ర తీరానికి రెండు మృతి తాబేళ్లు కొట్టుకు వచ్చాయి. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు గంటా నూకరాజు మాట్లాడుతూ గతంలో ఇలాంటి సందర్భాలు లేవని అన్నారు. రసాయనాలు సముద్రంలో ఉండడంవల్ల, లేక పెద్ద పడవలు క్రింద ఉండడం వల్ల కూడా ఈవిధంగా తాబేళ్లు మృత్యువాత పడే అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. అయితే దివీస్ కంపెనీ సముద్రంలోకి వ్యర్థాలు విడుదల చేస్తూ వుండడం వల్ల కూడా ఇలా మృత్యువాత పడే అవకాశాలు ఉంటాయని స్థానిక మత్స్య కారులు ఆందోళన చెందుతున్నారు.

# టీచర్స్ హెల్ప్స్ గ్రూప్ ఆధ్వర్యంలో టైలు, బెల్టుల పంపిణీ

భీమినిపట్నం : భీమినిపట్నంలో టీచర్స్ హెల్ప్సు గ్రూప్ ఆద్వర్యంలో భీమునిపట్నం 18వ వార్డులో గల మునిసిపల్ ఉన్నత పాటశాల విద్యార్థులకు టైలు, బెల్టు, స్కూల్‌బేగ్‌లు అందజేశారు. ఈ సందర్బంగా మునిసిపల్ ఉన్నత పాటశాల హెచ్.ఎం. సింహాచలం మాటలాడుతూ టీచర్స్ హెల్ప పేరుతో ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యున్నతకోసం తమవంతు సాయం అందివ్వడం అభినందనీయంమని అన్నారు పాటశాలలో 150 మంది విద్యార్థులకు టీచర్స్ హెల్ప్సు గ్రూప్ అధ్వర్యంలో టైలు, బెల్టు, వాటర్ బాటిల్స్ లు అందజేశారు. పేద విద్యార్థులకు ప్రోత్సాహం అందిచడం అభినంధనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ హెల్ప వ్యవస్తాపక అధ్యక్షులు మరగడ.రామకృష్ణ ,సభ్యులు అల్లాడి.శ్రీనివాసరావు, పండరీనాద్, కి.వి.రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు .

# డెంగ్యూ వ్యాధితో యువకుడు మృతి

పెదపూడి : తూర్పుగోదావరి జిల్లా పెనుగుదురులో డెంగ్యూ వ్యాధి విజృంభించి వ్యాది ఉనికిని చాటుతోంది గ్రామంలో సతీష్ అనే యువకుడు డెంగ్యూ వ్యాధితో మృతి చెందాడు పెనుగుదురు గ్రామంలో మరో 30మంది ఈ వ్యాది బారిన పడ్డారు ప్రజలు ఈ వ్యాధితో ప్రాణాలను విడుస్తున్నా వైద్య ఆరోగ్యశాఖ నిమ్మకు నీరెత్తినట్లు పట్టించుకోలేని స్థితిలో ఉందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు ఇప్పటికైనా వైద్య ఆరోగ్యశాఖ స్పందించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# పలు అభివృద్ది పనులకు శంఖుస్థాపన...

చోడవరం: మండలంలోని పలు అభివృద్ది పనులకు గురువారం స్దానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు చేతుల మీదుగా శంఖుస్దాపన చేసారు. వాటిలో లక్కవరం గ్రామంలో కళ్యాణ మండపం, గవరవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు అదనపు భవనములకు ఎమ్మెల్యే శంఖుస్థాపన చేసారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా సమస్యలన్నింటిని తీర్చేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛ భారత్ లక్ష్యంగా ప్రజలందరు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించు కోవలసిందిగా సూచించారు. దీని వలన ప్రజారోగ్యం బాగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు కె.వి.ఎస్.రవి, ఎం.పి.పి గూనూరు కొండతల్లి సత్యనారాయణ, జెడ్పీటిసి కె.మత్స్యరాజు, గవరవరం సర్పంచ్ చప్పగడ్డి వెంకట స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# నేడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి మహోత్సవం




అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం గ్రామంలోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర షష్టి మహోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం 5 గంటలకు స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలు అలంకరణలో దర్శనమిచ్చారు. 6 గంటలకు గ్రామోత్సవంలో భాగంగా స్వామి, అమ్మవార్లను శేష, మయూర వాహన తిరుచ్చి సేవాలో ఊరేగింపు కార్యక్రమం కనులు మిరుమిట్లుగొలిపే విధంగా జరిగింది. నేడు శ్రీ హేవలంబి నామ సంవత్సర మార్గశిర శుద్ద షష్టి సందర్భంగా తెల్లవారు ఝూమున 2.30 ని.లకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకము అనంతరం ఉదయం 5 గంటలకు భక్తులకు సర్వదర్శనములు జరుగును.మధ్యాహ్నము 3 గంటలకు లక్షపత్రి పూజ జరుగును.రాత్రి 7 గంటలకు శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దివ్య కళ్యాణం మహోత్సం జరుగును.తే.25 న ఉదయం 6 గంటల నుండి నిత్యాభిషేకం,సర్వదర్శనాలు రాత్రి 7 గంటలకు ఊంజల్ సేవ కార్యక్రమం 8 గంటలకు శ్రీ పుష్పయాగమహోత్సవంతో స్వామివారి కళ్యాణ మహోత్సవాలు ముగుస్తాయి అని ఆలయ ప్రధాన అర్చకులు తెలియజేసారు. ఈ మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొంటారు.

# అధికారం మరచి ఆప్యాయత పంచి



పెదపూడి: తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా గురువారం కరప హైస్కూలును ఆకస్మికంగా తనిఖీ చేశారు మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో పాటు సహాపంక్తి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు డి ఇ ఓ అబ్రాహాము పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రజా మద్ధతు యాత్రను జయప్రదం చేయాలి



ఆలమూరు : వైయస్సార్‌సిపి అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర విజయవంతం కావాలని ఈ నెల 26న కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తలపెట్టిన ప్రజా మద్ధతు యాత్రలో మండల పరిధిలోని అన్నివర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆలమూరు మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండల పరిధి చొప్పెల్లలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఆ రోజు ఉదయం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి రావులపాలెంలోని అమలాపురం రోడ్డున వున్న బేతెస్థ ప్రార్ధనా మందిరం (చర్చి)లోను, సమీపంలో వున్న మసీదులోను ప్రార్ధనలు నిర్వహించి అనంతరం పార్టీ కార్యాలయం నుండి పార్టీశ్రేణులో అభిమానులతో కలసి ఆత్రేయపురం మండలంలో కోనసీమ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయానికి పాదయాత్రను ప్రారంభిస్తారని, ఈ పాదయాత్రలో ప్రజల నుండి వచ్చే సమస్యలను స్వీకరిస్తారని ఆయన అన్నారు. ఈ సమావేశంలో వైయస్సార్‌సిపి రాష్ట్ర నాయకులు చల్లా ప్రభాకరరావు, జిల్లా, మండల పరిధి నాయకులు చల్లా వెంకట సుబ్రహ్మణ్యం, నామాల శ్రీనివాసు, తోరాటి లక్ష్మణరావు, నల్లిరాజు, నైనాల శ్రీరామచంద్రమూర్తి, యనమదల నాగేశ్వరరావు, పామర్తి శ్రీనివాసు, అడబాల ఆదినారాయణ, మోటిపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.ప్రపంచం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి అంబేద్కర్ - మాజీ ఎంపి హర్షకుమార్

# ఉచిత న్యాయాన్ని ఆశ్రయించిన బాధితులు

## కేసు నమోదు చేయాలని ఆదేశించిన సబ్ జడ్జి



యానాం : స్థానిక తాలూకా లీగల్‌సెల్ అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను వీరభద్రకాలనీకి చెందిన ఒక కుటుంబ సభ్యులు ఆశ్రయించడంతో యానాం లీగల్ సెల్ అథారిటీ చైర్మన్, సబ్‌జడ్జి ఎ.హరిహరకుమార్ సంబంధిత నిందితులపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. గురువారం ఉదయం యానాం సబ్‌కోర్టులో బాధితులు జడ్జిని ఆశ్రయించి జరిగిన ఘటన వివరించారు. స్థానిక వీరభద్రకాలనీలో నివాసం ఉంటున్న ఆకుల వీర్రాజు, ధనవతిలు కుటుంబ అవసరాల నిమిత్తం లక్షాయాభైవేల రూపాయలు అదే పేటలో ఉంటున్న అర్ధాని జగన్నాధం నుండి మూడు సంవత్సరాల క్రితం అప్పుతీసుకున్నారు. తీసుకున్న అప్పు తీరిగి ఇచ్చేయలని కోరడంతో లక్షాయాభైవేలు తిరిగి చెల్లించారు. రావలసిన వడ్డీ చెల్లించాలని బుధవారం రాత్రి ఆకుల వీర్రాజు ఇంటికివెళ్ళి అర్ధాని జగన్నాధం, ఎ శ్రీను, ఎ.దేవి మరదలు ఎ సత్యవేణి, ఎ. సీతమ్మ, ఎ. లక్ష్మి, పి. గౌరమ్మలు దాడిచేసి గాయపరిచారు. ఈ దాడిలో ఆకుల వీర్రాజు ఎడమకాలు విరిగింది. దీంతో వీరు ఆసుపత్రికి చేరి వైద్యం చేయించుకొని పోలీసులను ఆశ్రయించారు. జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేయడానికి నిరాకరించడంతో వారికి తెలిసినవారితో పోలీసులకు చెప్పడంతో కేసు తీసుకున్నారు. అయితే దాడికి పాల్పడినవారిని అరెస్టు చేయకపోవడంతో గాయాలుపాలైన ఆకుల వీర్రాజు గురువారం ఉదయం ఉచిత న్యాయసేవలు సంబంధించిన ఎఫోన్ నెంబరు 08842324002కు ఫోన్ చేయడంతో సంబంధితులు జడ్జి దృష్టికి తీసుకువెళ్ళారు. దీంతో బాధితులను కోర్టుకు రమ్మని చెప్పడంతో నేరుగా జడ్జివద్దకు తీసుకువెళ్ళి జరిగిన ఘటనపై వివరాలు అడిగి తక్షణ సంబంధితులను అరెస్టుచేసి కేసు నమోదుచేయాలని ఆదేశించారు. దీంతో పోలీసులు దాడికి పాల్పడిన వారిని ఇద్దరిని అరెస్టుచేసారు. మిగిలిన ఐదుగుర్ని అరెస్టుచేయలేదు. బాధితుడు వీర్రాజు జరిగిన ఘటనా విషయాన్ని విలేకరులకు వివరించారు. తమ కుటుంబానికి నిందితులవల్ల ప్రాణహాని ఉందని తమకు రక్షణకల్పించాలని కోరారు. ఈ విషయంపై యానాం పోలీసులను వివరాలు అడుగ్గా వాటి వివరాలు చెప్పడానికి నిరాకరించారు. ఎఎస్‌ఐని అడిగి చెపుతామని నమ్మబలికారు. పోలీసుస్టేషన్‌కు వెళ్ళినవారికి న్యాయం జరగపోవడంతో ఉచిత న్యాయ సేవలను ఆశ్రయించడం జరిగిందని ఆకుల వీర్రాజు సంతృప్తి వ్యక్తంచేశారు.

# దాతలుచేసిన ధర్మాలు - చిరస్థాయి జ్ఞాపకాలు

## - ఎంపీ తోట నరశింహం



పెద్దాపురం : జీవితంలో పదికాలాలు చిరస్థాయిగా నిలబడేవి ధానాలు మాత్రమేనని, పాలకులు మారిన, పరిస్థితులు మారిన ధానధర్మాలు మారవని పార్లమెంటు సభ్యులు తోట నరశింహం అన్నారు. పెద్దాపురం పట్టణంలోగల కీ.శే. శ్రీమతి రాజ వత్సవాయి బుచ్చి సీతయ్యమ్మ జగపతి బహుద్దూరు మహారాణి 182వ వర్ధంతి సందర్భంగా మహారాణీ సత్రంలో జరిగిన వస్త్రధాన, అన్నధాన కార్యక్రమానికి తోట నరశింహం ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. మహారాణీవారు పెద్దాపురం సత్రంకు 550 ఎకరాలు దానం చేయడం 1820లో జరినదని అప్పటినుండి అనేకమందికి నిత్యాన్నదానం జరుగుచున్నదని దీనికి తోడు మహారాణి కళాశాల ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు అన్నదానం కొనసాగుతున్నదని అన్నారు. ఈ సత్రంలో అన్నదానం వలన, కళాశాల విద్యవలన పెరిగి పెద్దవారైనవారు ఎందరో ఉన్నారని నరశింహం అన్నారు. అటువంటి మహనీయులను నిత్యం మనం తలుచుకోవాలని కోరారు. ఇకముందు కూడ ఇదేవిధంగా అన్నదానం, వస్త్రదానం జరగాలని కోరారు. మునిసిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు మాట్లాడుతూ ఈ సంత్రం సదుపాయాలతో అనేమంది ఉద్యోగులు, రాజకీయ నాయకులు, ప్రొఫెసర్లు, ఉన్నతస్థానం పొందినవారు ఉన్నారని అన్నారు. మహారాణీ చేసిన అన్నదానం, విద్యాదానం మరవలేనివని చైర్మన్ సూరిబాబు అన్నారు. నిత్యం రోజుకి 500 మందికి అన్నదానం జరుగుచున్నదని అన్నారు. అనంతరం పేదలకు అన్నదానం, వస్త్రదానాలను ఎంపీ తోట నరశింహం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కురపూరి రాజు, కనకాల సుబ్రమణ్యేశ్వరరావు, కొత్తవీరన్న, వి. రాజశేఖర్, టి. సాయి, బి బంగారుబాబు, 26వ వార్డు కౌన్సిలర్ ఉమామహేశ్వరి, టి. రాజు, కె. రాంబాబు, సత్రం ఇఒ పుష్పనాధం, సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్రభాను



## ప్రేమలో పడితే సైకోగా మారిపోతాను!

ప్రేమించడం..డేటింగ్ చేయడం ఆ తరువాత పెళ్లి చేసుకోవడం అనేది నాకు తెలిసినంత వరకు పెద్ద తలనొప్పి వ్యవహారం. ప్రేమించడం, డేటింగ్ చేయడం అనేవి నాకు నచ్చవు. నేను ప్రేమలో పడితే మాత్రం సైకోగా మారిపోతాను. పెద్దలు నిర?యించిన పెళ్లినే ఇష్టపడతాను అని తెలిపింది నివేతా పేతురాజ్. ఆమె కథానాయకగా పరిచయమవుతున్న తాజా చిత్రం మెంటల్ మదిలో. శ్రీవిష్ణ? కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి వివేక్ ఆత్రేయ దర్శకుడు. రాజ్ కందుకూరి నిర్మించిన ఈ చిత్రం రేపు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భేగా బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో నివేతా మాట్లాడుతూ తమిళనాడులో పుట్టాను. తరువాత మా కుటుంబం వ్యాపార రిత్యా దుబాయ్‌లో స్థిరపడింది. గత పదిహేనేళ్లుగా అక్కడే వుంటున్నాం. కొన్ని వాణిజ్య ప్రకటనల్లో నటించాను. 2015లో మిస్ ఇండియా దుబాయ్‌గా ఎంపికయ్యాను. ఆ సమయంలోనే తమిళ దర్శకుడు నెల్సన్ వెంకటేషన్ ఒరునాల్ కూతు చిత్రంలో నటించే అవకాశం ఇచ్చారు. అలా అనుకోకుండానే సినిమాల్లోకి ప్రవేశించాను. ఇదే చిత్రం తెలుగులో పెళ్లిరోజు పేరుతో అనువాదమైంది. ఇప్పటి వరకు తమిళంలో నాలుగు చిత్రాల్లో నటించాను. మెంటల్ మదిలో తెలుగులో నేను నటిస్తున్న తొలి చిత్రం. తమిళంలో జయం రవితో కలిసి నటించిన తొలి స్పేస్ చిత్రం టిక్ టిక్ టిక్ ట్రైలర్ ఈ నెల 24న విడుదల కానుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుందనే నమ్మకముంది. దళపతి ప్రభు దర్శకత్వంలో పధువాగ ఎన్ మనసు తంగం చిత్రంలో నటిస్తున్న సమయంలో దర్శకుడు వివేక్ ఆత్రేయ నా ఇంటర్వ్యూలు చూసి మెంటల్ మదిలో చిత్రంలో అవకాశం ఇచ్చారు. కథ వినగానే వెంటనే ఓకే చెప్పేశాను. ఇందులో నా పాత్ర పేరు స్వేఛ?. నా స్వభావానికి చాలా దగ్గర వుంటుంది. స్వతంత్ర భావాలున్న అమ్మాయి. తనకు ఏం కావాలో ఆమెకు బాగా తెలుసు. అలాంటి అమ్మాయి జీవితంలోకి ఓ యువకుడు ప్రవేశిస్తాడు. ఆ తరువాత ఏమైంది? స్వేఛ? జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది అనేది తెరపైన చూడాల్సిందే. ఈ చిత్రంలో నటించడానికి ప్రయత్నించలేదు. నిజ జీవితంలో ఎలా వుంటానో అలాగే ప్రవర్తించాను. నటన గురించి పెద్దగా నేర్చుకోలేదు కానీ నన్ను మంచి నటిగా ప్రేక్షకులు గుర్తిస్తే చాలు. ప్రస్తుతం తెలుగు నేర్చుకుంటున్నాను. నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పుకోవాలనుకుంటున్నాను. తెలుగులో ఇంకా ఏ సినిమా అంగీకరించలేదు అని తెలిపింది.

## నాన్నా కొడుకూ సేమ్ టూ సేమ్



ఈ మధ్య టాలీవుడ్ లో గుబురు గడ్డం ఫ్యాషన్ అయిపోయింది రావప చరన్, నితిన్, వరుణ్ తేజ్ ఇలా వరుస పెట్టి యువహీరోలంతా గడ్డాలు పెంచేస్తున్నారు. అయితే చెర్రీ గడ్డానికి రంగస్థలం కారణం అనుకోండి.. రంగస్థలం కోసం రామ్ చరణ్ పెంచిన గెడ్డం రేపో మాపో పోతుంది కానీ... మెగాస్టార్ ని మాత్రం వచ్చే యేడాదివరకు గెడ్డంతోనూ చూడబోతున్నాం.

ఆయన నటిస్తున్న సైరా ఇప్పుడిప్పుడే సెట్స్ పైకి వెళ్లింది కాబట్టి. ఇప్పుడు చిరు కూడా గుబురు గడ్డం లుక్ లోకి వచ్చేసాడు... ఒకే రకమైన గెడ్డంతో ఇప్పుడిదంతా ఎందుకంటారా? ఇద్దరూ ఒకే రకమైన గెడ్డంతో - ఒకే డ్రెస్‌తో మెగా హీరోలిద్దరూ కలిసి కనిపించారు కాబట్టి. ఎప్పుడు ఎక్కడంటే రామ్ చరణ్ తన తండ్రిని కాఫీ కోసం బయటికి తీసుకెళ్లాడు.

కాఫీ షాప్ లో ఇద్దరూ కలిసి పిచ్చాపాటిగా మాట్లాడుకొంటూ సేద తీరారు. నేను, నాన్న సేమ్ టు సేమ్ మెగాపవర్ స్టార్ రామ్‌చరణ్ తన ఫేస్ బుక్ పేజీలో చిరుతో ఉన్న ఫొటోను షేర్ చేసి మెగాభిమానులకు సంతోషాన్ని కలిగించారు.

"నేను, నాన్న సేమ్ టు సేమ్. ఇద్దరం గడ్డం లుక్ లోనే, ఇది మాకు కాఫీ టైమ్. నాన్నగారితో ఆనందంగా ఇలా బయటికి వచ్చి కాఫీ త్రాగడం కోసం ఒప్పించాను" అంటూ రామ్‌చరణ్ ఈ ఫొటోని పోస్ట్ చేశాడు.

## నగ్మా జీవిత కథే ఈ సినిమా??

సౌత్ గ్లామర్ సెన్సేషన్ లక్ష్మీ రాయ్ 'జూలీ 2' సినిమా ద్వారా బాలీవుడ్లో అడుగు పెడుతోంది. బాలీవుడ్ తొలి ప్రయత్నంలోనే తన సెక్సీ అందాలకు బాగా సూటయ్యే సినిమాను ఎంచుకున్న ఈ బ్యూటీ సౌత్ ప్రేక్షకులు ఇప్పటి వరకు ఊహించని బోల్డ్ అవతారంలో కనిపించబోతోంది. గతంలో నేహ ధూపియా ప్రధాన పాత్రలో రూపొందిన 'జూలి'కి సీక్వెల్ గా తెరకెక్కుతున్న 'జూలీ 2' చిత్రాన్ని శివదాసాన్ని రూపొందిస్తున్నాడు. అక్టోబర్ 6న సినిమా విడుదల కాబోతోంది. తాజాగా విడుదలైన ట్రైలర్ లక్ష్మీరాయ్ అభిమానుల మతి పోగొడుతోంది. లక్ష్మీరాయ్ ఈ చిత్రంలో బోల్డ్‌గా నటిస్తుందని, బికినీల్లో అందాలు ఆరబోస్తుందని అందరూ ఊహించారు. అయితే ఇందులో ఆమె న్యూడ్ సీన్లు, ముద్దు సీన్లు కూడా చేసి అందరినీ ఆశ్చర్యంలోకి ముంచెత్తింది. ఈ సినిమా విడుదల తర్వాత బాలీవుడ్ తెరపై సరికొత్త గ్లామర్ హీరోయిన్‌గా కీర్తింపబడుతుందని, ఆ సినిమా తర్వాత ఆమెను అంతా లక్ష్మీరాయ్ బదులు సెక్సీ రాయ్ అని పిలుస్తారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయ.

## నీరు.. జీవనాధారం

### 'జలనీయుడు' సత్యనారాయణ



జలం లేని జీవనం అనూహ్యం. ప్రకృతికి కూడా నీరే జీవనాధారం. సృష్టి ధర్మంలో ముందుగా యావత్ప్రపంచమంతా నీటితో నిండి ఉంది అని పురాణాలు వచిస్తున్నాయి. అందుకే దశావతారాలలో ముందుగా పేర్కొనబడేది మత్స్యావతారం. అంటే జల చరాలైనటువంటి చేపలు. పంచ భూతాలలో ముందుగా పేర్కొనిది కూడా నీటినే. నీరు లేని ఊరు, నీరు లేని బావి.. ఇలా చెప్పుకుంటే పోతే నీరు లేని ప్రదేశంలో మనిషి తన జీవనాన్ని కొనసాగించగలగడం దుర్భరం. నీరు లేనిదే పాడిపంటలు లేవు. పాడిపంటలు లేని చోట పశుపక్ష్యాదులు సైతం మనగలగడం కష్టం. అటువంటి నీటిని గూర్చి మనం ఎంత చెప్పుకున్నా తక్కువే. ఎంత చెప్పుకున్నా ఉంకా ఉంటూనే ఉంటుంది. అటువంటి జలం గూర్చి తెలుసుకోవడం.. నీటిని ఒడిసిపట్టి జీవనాధారం పెంపొందించుకోవడానికై ప్రవహించే నీటికి అడ్డుకట్ట వేసి నిలువ చేసి డ్యాముల సహాయంతో అవసరమైనప్పుడు వాడుకుని పంటలే కాదు.. బంగారు పంటలు పండించుకోవచ్చు. అప్పటినుంచి నీటిని విచ్చలవిడిగా వాడుకుని ఇప్పుడు నీటిని వాడుకోవడానికి కరవు రోజులు దగ్గర పడుతుండడంతో నదుల అనుసంధానం, నదుల రక్షణ పేరుతో ఉద్యమాలు చేసేందుకు సిద్ధమౌతున్నారంటే నీటి ప్రాశస్త్యం ఎంతగా పెరిగిందో ఇట్టే గమనించవచ్చు. ఇంతటి విశిష్టమైన నీటిని ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి నిలువ చేయాలనే సత్సంకల్పంతో అవతరించిన **'జలనీయుడు' సత్యనారాయణ.**

| | | |
|---|---|---|
| **పేరు** | : | **శీలబోయిన సత్యనారాయణ..** |
| **తల్లిదండ్రులు** | : | **మహాలక్ష్మి, నారాయణ** |
| **జననం** | : | **1937, జూన్ 10.** |
| **చిరునామా** | : | **తిరుపతిపురం గ్రామం,<br>అత్తిలి మండలం<br>పశ్చిమ గోదావరి జిల్లా<br>ఆంధ్రప్రదేశ్** |

తాను పుట్టి పెరిగింది అత్తిలి గ్రామం కావడంతో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకూ విద్యాబుద్ధులు చక్కగా నేర్చారు. అన్ని తరగతులలో ఉత్తీర్ణతా శాతం అధిక మార్కులే వచ్చేవి. హైస్కూలు చదువులైన 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు తనకు వచ్చే స్కాలర్‌షిప్పులపైనే ఆధారపడి జాగ్రత్తగా చదువుకొనసాగించారు. డబ్బు ఎక్కువగా లేని కారణంగా వచ్చే స్కాలర్‌షిప్పు డబ్బులతోనే బట్టలు, పుస్తకాలు మొదలయినవి కొనుక్కుని డబ్బులు దుబారా చేయకుండా అతి జాగ్రత్తగా ఖర్చు చేసుకునేవారు. కాలేజీ చదువులు చదువుకొనేందుకు డబ్బులు చాలవని గ్రహించిన ఆయన ఎలాగైనా టీచర్ ఉద్యోగం చేయాలనే ఉద్దేశ్యంతో పాలకొల్లు సమీపంలో అడవిపాలెంలో గల సెకండరీ గ్రేడ్ టీచర్ బేసిక్ ట్రైనింగ్ స్కూల్‌కి ఇంటర్వ్యూకు వెళ్లారు. అక్కడ హాస్టల్‌లో అయితే ఉచిత భోజన, వసతి సౌకర్యం ఉంటుందని తెలిసి అక్కడికి వెళ్లారు. సత్యనారాయణను ఇంటర్వ్యూ చేసిన అధికారి అతని మార్కులు చూసి ఆశ్చర్యపోయి 'నువ్వు కళాశాలలో ఉన్నత చదువులభ్యసించవలసిన వాడివి. నీ చదువు ఎందుకు ఇంతటితో ఆపేస్తున్నావు? అని అడుగగా తన బీద స్థితి గురించి పూసగుచ్చినట్లు వివరించి చెప్పారు సత్యనారాయణ. తన ఆర్థిక స్థితి అంతంతమాత్రమని గ్రహించిన డిఇఓ తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే అయిన చింతలపాటి వరప్రసాద్‌కు చెప్పడంతో అతను సత్యనారాయణను భీమవరంలోని డబ్ల్యుజిబి కళాశాలలో ఉన్నత చదువుల కోసం ఇంటర్మీడియట్‌లో చేర్పించారు. చదువునిమిత్తం డబ్బులయితే ఇచ్చారే కానీ మరి భోజనం నిమిత్తం ఏం చేయాలి అని ఆలోచించుకున్న ఆయన రోజుకు ఒక్కొక్కరి ఇంటికి చొప్పున వారం రోజులు ఏడుగురి ఇళ్లు ఎంచుకుని వారాలబ్బాయిగా రెండేళ్లు గడిపి తన ఇంటర్మీడియట్ చదువు పూర్తి చేయగలిగారు. వసతి నిమిత్తం గన్నాబత్తుల పెదతాతగారి ఇంట్లో ఒక గదిలో ఒక చాప, దుప్పటితో కాలం గడిపేశారు. కాలేజీతో తను చదువుకుంటున్న రోజుల్లో పూర్ బాయ్ ఫండ్స్ నిధుల నుంచి చదువు పూర్తి చేశారు. తదనంతరం ఇంజనీరింగ్ విద్యకోసం కాకినాడ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రభుత్వ స్కాలర్‌షిప్‌తోనే విద్యను పూర్తి చేశారు. ఇంత చదువుకూడా పస్తులతోనే పూర్తి చేశారంటే అతిశయోక్తి కాదేమో.

ఇంజనీరింగ్ విద్య పూర్తి చేసిన తరువాత తాను చదువుకున్న విద్యకు సార్థకత చేకూర్చేందుకు వివిధ సంస్థలలో ఇంజనీర్‌గా పని చేస్తూ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి చాలావరకు నైపుణ్యం, బాధ్యతతో వ్యవహరించి ఆలిండియా కౌన్సిల్‌ను తొలుతగా విశాఖలో నిర్వహింపజేశారు. ఈ విధంగా ఉత్తరాంధ్రలోని వంశధార స్టేజ్-1, మడ్డువలస, ఆంధ్ర, వెంగళరాయసాగర్, తోటపల్లి ప్రాజెక్టు, రామతీర్థ సాగర్ ప్రాజెక్టు పనుల్లో నాణ్యత ఉండేలా శ్రద్ధ చూపి శభాష్ అనిపించుకున్నారు. విశాఖ ఏజెన్సీలో అరకు, పాడేరు, చింతపల్లి ఏజెన్సీ ప్రాంతాల్లో మంచినీటి ఆవశ్యకతను గురించి తెలియజేసి అక్కడి ప్రజల్లో అవగాహన కల్పించి శారదా ట్రస్ట్ ద్వారా తన సేవలందించారు. సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నా ఉత్తరాంధ్ర వెనుకబాటు తనానికి ప్రధాన కారణం నిర్లక్ష్యమేనని అన్నారు. తాగు, సాగు, పరిశ్రమల నీటి అవసరాలు తీర్చాలంటే అందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీం నియామకం ఎంతైనా అవసరమని అన్నారు. రాష్ట్ర విభజన జరిగితే మంచినీటి సమస్య ఉభయ రాష్ట్రాలకు ఏ విధంగా వస్తుందో శ్రీ కృష్ణ కమిషన్‌కు ఆయన ముందుగానే సూచించారు.

**చదువు, ఉద్యోగ బాధ్యత ఎంత ముఖ్యమో జీవితంలో వివాహం, నలుగురికి ఆదర్శంగా ఉండడమూ అంతే ముఖ్యము అనే విషయాన్ని గ్రహించి 1958లో తన మేనమామ కూతురైన బాలసరస్వతిని కట్నం లేకుండా ఆదర్శ వివాహం చేసుకున్నారు. ప్రతీ పురుషుని విజయం వెనుక ఒక స్త్రీ హస్తముంది అనే సూక్తి ప్రకారం సత్యనారాయణను తిరుగులేని విజయరాజుగా తీర్చిదిద్దింది.**

ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసి ఫలితాలు రాకముందే సత్యనారాయణను నాగార్జున సాగర్ చీఫ్ ఇంజనీర్ జాఫర్ అలీ 1959లో జూనియర్ ఇంజనీర్‌గా నియమించారు. 1995 వరకూ ఆయన ఉద్యోగంలో కొనసాగుతూ వచ్చారు. తన పదవీ ప్రస్థానంలో అనేక ఇంజనీరింగ్ ప్రాజెక్టులకు రూపకల్పన చేసి తాగు, ఎసాగునీటి వనరులకు రూపకల్పన చేశారు.

ఉదాహరణకు విశాఖ జిల్లాలో మేఘాద్రిగెడ్డ, కోణాం, తాండవ రిజర్వాయర్ల నిర్మాణం పూర్తి చేశారు. నేటి పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూపశిల్పి కూడా సత్యనారాయణే. అంతేకాకుండా ఏలేరు ప్రాజెక్టు ద్వారా విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు నీరు సరఫరా చేయాలన్న ఆలోచనలతో ప్రాజెక్టు నివేదికను తయారు చేసి రూపొందిండమే కాకుండా సకాలంలో పని పూర్తి చేయించారు. చీరాలలో పని చేసినపుడు కృష్ణా-డెల్టా డ్రైనేజీ వ్యవస్థకు రూపకల్పన చేశారు. శ్రీకాకుళం జిల్లాలో పని చేసినపుడు వెన్నెలవలస తదితర అనేక ప్రాజెక్టులు పూర్తి చేయించారు.

అనకాపల్లిలో రెండేళ్లు ఉండి ఏలేరు నీరు విశాఖపట్నానికి తరలించడంలో కృతకృత్యులయ్యారు. మీడియం ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్‌గా ప్రమోషన్ వచ్చాక తెలుగు గంగ ప్రాజెక్టు నిర్మాణం పనులను ప్రభుత్వం ఆయనకు అప్పగించింది. తోటపల్లి ప్రాజెక్టును పూర్తి చేసి లక్షలాది ఎకరాలు శస్యశ్యామలం అయ్యాయంటే అందుకు కారణం సత్యనారాయణ పేరు చెప్పక తప్పదు.

ఏ ప్రాజెక్టు రూపకల్పనైనా, నిర్మాణమైనా సత్యనారాయణ ప్రమేయం లేదంటే అది అతిశయోక్తికాదు.

# క్వార్టర్స్‌లో సింధు



హాంకాంగ్: హాంకాంగ్ ఓపెన్ సూపర్ సిరీస్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ షట్లర్ పివి సింధు క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్స్‌లో సింధు 21-14, 21-17 తేడాతో అయా ఒహోరి (జపాన్)పై గెలిచి క్వార్టర్స్ బెర్తును ఖాయం చేసుకుంది.

ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో సింధు ఆద్యంతం పైచేయి సాధించింది. వరుస రెండు గేమ్‌లను సునాయాసంగా గెలిచిన సింధు తదుపరి రౌండ్‌కు అర్హత సాధించారు. కేవలం 39 నిమిషాల్లోనే సింధు విజయం సాధించి మరొకసారి సత్తాచాటింది. ఒహోరీపై తాజా విజయంతో ముఖాముఖి రికార్డును సింధు 3-0 మరింత మెరుగుపరుచుకుంది.

## శ్రీవారి సేవలో గ్రీన్ ట్రైబ్యునల్ చైర్మన్

తిరుమల: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని గ్రీన్ ట్రెబ్యునల్ ఛైర్మన్ జస్టిస్ స్వతంత్ర కుమార్ దర్శించుకున్నారు. గురువారం ఉదయం వీఐపీ ప్రారంభ దర్శన సమయంలో ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. స్వతంత్రకుమార్‌కి తితిదే అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆయనకు వేదాశీర్వచనం పలికి శేషవస్త్రంతో సత్కరించారు. తిరుమల పరిశుభ్రతతో పాటు వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉందని పేర్కొన్నారు.

# బయో మేనిఫాక్చరింగ్ హబ్‌గా భారత్

- బయోటెక్నాలజీ విభాగానికి 2222 కోట్లు నిధులు
- కేంద్ర పెట్రోలియం, నేచురల్ గ్యాస్ స్టాండింగ్ కమిటి చైర్మన్ ప్రహ్లాద్ జోషి

ఆంధ్ర యూనివర్శిటీః మౌళిక వసతులు, పరిశోధనలు అభివృద్ధి చేస్తూ బయో మేనిఫాక్చరింగ్ హబ్‌గా భారత్‌ను తీర్చిద్దిదడం జరుగుతోందని కేంద్ర పెట్రోలియం, నేచురల్‌గ్యాస్ స్టాండింగ్‌కమిటి చైర్మన్ ప్రహ్లాద్ జోషి అన్నారు. గురువారం ఉదయం ఆంధ్రవిశ్వవిద్యాలయం, ఒమిక్స్ పబ్లిషింగ్ గ్రూప్ సంయుక్తంగా ఆంధ్ర విశ్వ విద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహిస్తున్న ఎన్విరాన్‌మెంటల్ బయో టెక్నాలజీపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ బయో టెక్నాలజీ డిపార్ట్‌మెంట్‌కు 2222.11 కోట్ల రూపాయలు నిధులు అందించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వాలకంటే 22 శాతం అధికంగా నిధులను కేటాయించా మన్నారు. నేషనల్ బయయోటెక్ స్ట్రాటజీకి అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. ఐటి రంగంలో సమానంగా బయోటెక్ రంగాన్ని అభివృద్ధి చెందిస్తూ 2025 నాటికి వంద బిలియన్ డాలర్ల టర్నోవర్‌ను సాధించడం లక్ష్యమన్నారు.



పర్యావరణ సమస్యలకు బయోటెక్నాలజీ పరిష్కారం చూపగలదన్నారు. ప్రతికూల పరిస్థితులలో సైతం వ్యవసాయ ఉత్పత్తి అభించే దిశగా బయోటెక్నాలజీ అవసరమైన తోడ్పాటును అందిస్తుందన్నారు. ప్రపంచలో ఇంధన అవసరత పెరుగుతోందన్నారు. 2011 నాటికి 31 జిటిల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు ఉన్నాయని, 2035 నాటికి వీటి శాతం 37 జిటిలకు పెరుగుతుందన్నారు. బయో ఎనర్జీతో కర్బన ఉద్గారాలను నియంత్రించడం సాధ్య పడుతుందన్నారు. 2035 నాటికి 20 నుంచి 30 శాతం వరకు బయో ఎనర్జీని వినియోగించడం జరుగుతుందన్నారు.

కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు, ఓమిక్స్‌పబ్లిషింగ్ గ్రూప్ సిఈఓ గేదెల శ్రీనుబాబు, ఐఐపిఇ సంచాలకులు ఆచార్య వి.ఎస్.ఆర్.కె ప్రసాద్, ఎమ్మెల్సీ పి.వి.ఎన్ మాధవ్, రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వర రావు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్ అవధాని, ఇండియన్ ఎకనామిక్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ఎగ్జిక్యూటివ్‌వైస్ ప్రెసిడెంట్ హెన్‌డ్రిక్స్ వాన్ డార్ట్ ,కన్వీనర్ ఆచార్య డి.శ్రీరామి రెడ్డి , ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎన్.ఎం యుగంధర్, విభాగాధిపతి ఆచార్య ఎస్.వి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



## జినోమిక్స్ బయోటిక్ సిఇఓ గీతం సందర్శన

సాగర్‌నగర్ : జీవ శాస్త్ర పరిశోధనలలో ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న సంస్థలలో ఒకటిగా పేరుపొందిన జినోమిక్స్ బయోటెక్ (యుఎస్ఎ) వ్యవస్థాపక అధ్యక్షుడు, సిఇఓ డాక్టర్ రత్నగిరి పోలవరపు గురువారం గీతం ఓమ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాడి పరిశ్రమలో పశువులకు వ్యాధి సోకకుండా బయోటెక్నాలజీ రంగంలో అభివృద్ధి చేస్తున్న వివిధ రకాల మందుల అవసరాలను వివరించారు. బయో టెక్నాలజీ రంగం భవిష్యత్తులో రైతుల ఆదాయ మార్గాలను పెంచేందుకు పరిశోధనలు విస్తృతం చేస్తోందన్నారు. యుజిసి వ్యవహారాల డైరక్టర్ ప్రొఫెసర్ సి.హెచ్.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గీతంను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఎంపిక చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రత్నగిరి పోలవరపును యుజిసి వ్యవహారాల డైరక్టర్ ప్రొఫెసర్ సి.హెచ్.రామకృష్ణ సన్మానించి జ్ఞాపికను అందజేశారు.



## ఒక్కటైన జహీర్-సాగరిక జోడీ

దిల్లీ: భారత మాజీ క్రికెటర్ జహీర్ ఖాన్ ఓ ఇంటివాడయ్యాడు. బాలీవుడ్ భామ సాగరికతో గురువారం జహీర్ వివాహం నిరాడంబరంగా జరిగింది. ఈ రోజు వారు అతికొద్ది మంది కుటుంబ సభ్యుల మధ్య ఒక్కటయ్యారు. గులాబి రంగు కుర్తాలో జహీర్, నారింజ పండు రంగు చీర, ప్రత్యేక ఆభరణాలు ధరించిన సాగరిక జోడీ చూడముచ్చటగా ఉంది.

ఇందుకు సంబంధించిన ఫొటోలను వీరి స్నేహితులు సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్నారు. ఈ నెల 27న ముంబయిలోని తాజ్‌మహల్ ప్యాలెస్‌లో ఈ జోడీ వివాహ విందు కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ ఏడాది ఐపీఎల్ జరిగే సమయంలో జహీర్.. సాగరికను గోవా తీసుకెళ్లి తన ప్రేమ విషయం తెలిపాడు.

జహీర్ ప్రపోజల్‌కు సాగరిక ఓకే చెప్పింది. ఏప్రిల్‌లో నిశ్చితార్థం జరిగినట్లు ట్విటర్ వేదికగా జహీర్ అభిమానులకు వెల్లడించిన సంగతి తెలిసిందే. జహీర్-సాగరికల శుభలేఖ ఇదే అంటూ ఓ కార్డు ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

వివాహ విందుకు అతిథులను ఆహ్వానించిన క్రమంలో కార్డుతో పాటు చాక్లెట్ బాక్సు అందజేసినట్లు సమాచారం.

## కాపు రిజర్వేషన్‌లో వర్గీకరణ ఉండాలి

### ముఖ్యమంత్రికి ముద్రగడ పద్మనాభం లేఖ

కాకినాడ: కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి లేఖ రాశారు. కాపులకు బీసీ రిజర్వేషన్‌ను రెండు నెలల్లో అమలుచేస్తామని కాకినాడ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చంద్రబాబు మీడియాకు తెలిపారని, ఈ మేరకు డిసెంబర్ 6వ తేదీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా తీపికబురు చెప్పాలని ఆయన గుర్తుచేశారు. భవిష్యత్తులో తగదాలు రాకుండా తమకు కల్పించే రిజర్వేషన్‌లో ఏబీసీడీ వర్గీకరణ ఉండాలని పేర్కొన్నారు.

# బాబు నటనకు నంది అవార్డు ఇవ్వాల్సిందే



### వైకాపా అధికార ప్రతినిధి పార్థసారథి

విజయవాడ: పోలవరం ప్రాజెక్టును సీఎం చంద్రబాబు ప్రహసనంగా మార్చేశారని వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి కె. పార్థసారథి మండిపడ్డారు. గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... అసెంబ్లీలో చంద్రబాబు నటనకు నంది అవార్డు ఇవ్వాలన్నారు. పోలవరానికి కేంద్రం సహకరించకపోతే ఎన్డీఏ ప్రభుత్వంలో ఎందుకు కొనసాగుతున్నారని సూటిగా ప్రశ్నించారు. పోలవరం విషయంలో వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు సర్కారు పాపాలను ప్రజలు భరించలేకపోతున్నారని ధ్వజమెత్తారు. నకిలీ విత్తనాలకు ఏపీ నిలయంగా మారిందని దుయ్యబట్టారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. రైతులకు తమ సమస్యలు చెప్పుకునే అవకాశం ఇవ్వరా? రైతులకు నిరసన తెలిపే హక్కు లేదా అని ప్రశ్నించారు. ప్రతిపక్షాలను, ఉద్యోగులను, నష్టపోయిన రైతులను కలవాలంటే ఎందుకు ప్రభుత్వం భయపడుతోందని ఆయన నిలదీశారు. కృష్ణా జిల్లా మంత్రులు దద్దమ్మల్లా తయారయ్యారని పార్థసారథి ఘాటుగా విమర్శించారు.

## పాండ్యకు బ్యాకప్ ఆల్‌రౌండర్

### టీమిండియా సారథి విరాట్ కోహ్లి

నాగ్‌పూర్: హార్దిక్ పాండ్య తరహా సామర్థ్యాలున్న విజయ శంకర్ కఠినమైన విదేశీ పర్యటనల్లో బ్యాకప్ ఆల్‌రౌండర్‌గా ఉంటారని టీమిండియా సారథి విరాట్ కోహ్లి అన్నారు. శ్రీలంకతో రెండో టెస్టు మ్యాచ్‌కు ముందు మీడియాతో మాట్లాడారు. పెళ్లి సందర్భంగా జట్టుకు దూరమైన భువనేశ్వర్ స్థానంలో తమిళనాడు ఆల్‌రౌండర్ విజయ్‌శంకర్‌ను ఎంపిక చేసిన సంగతి తెలిసిందే.

విజయ్ శంకర్ నిలకడగా ప్రదర్శనలు చేస్తూ జాతీయ జట్టులో స్థానం సంపాదించాడు. మీడియం పేస్‌తో బౌలింగ్, చక్కటి బ్యాటింగ్ చేయగల మరో ఆల్‌రౌండర్‌ను దృష్టిలో ఉంచుకొని అతడిని ఎంపిక చేశాం. హార్దిక్ పాండ్యకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నా. విదేశీ పర్యటనలప్పుడు మేం బ్యాకప్ ఓపెనర్ గురించి యోచిస్తున్నాం. టీమిండియాకు అలవాటు పడేందుకు ఇక్కడికి తీసుకొచ్చాం. అతను తన ఆటపై బాగా దృష్టి సారించాల్సి ఉంది. విజయ్ శంకర్ సమతూకం ఉన్న క్రికెటర్. మంచి ఫీల్డర్. రోజుకు 10-12 ఓవర్లు సులభంగా వేయగలడు. నేను నెట్స్‌లో చూసినదాని ప్రకారం అతను దృఢమైన బ్యాట్స్‌మన్. అతడి జీవితంలో ఇదొక గొప్ప అవకాశం అని కోహ్లి అన్నారు.



## వైభవంగా అమ్మవారి మార్గశిర మాసోత్సవం

పూర్ణామార్కెట్ : బురుజుపేటలో వేంచేసియున్న శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మార్గశిర మాసోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి లక్ష్మివారం కావడంతో అమ్మవారి దేవస్థానానికి భక్తజనం పోటెత్తారు. బుధవారం రాత్రి తెల్లవారితే గురువారం గం. 12.05 ని.లకు వేదమంత్రములు నడుమ, నాదస్వర సుస్వరములతో ప్రత్యేక పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మొదటి పూజా కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్, ఉపకలెక్టర్ & కార్యనిర్వహణాధికారి ఎస్. జ్యోతిమాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ డబ్ల్యు భాస్కరరావు, ధర్మకర్తలు చిప్పాడ చంద్రరావు, పిల్లి వెంకట రమణ, కె. భాస్కరరావు, ఓ. శివయ్య, ఆర్. చలపతిరావు, వి. విజయకుమార్, సిహెచ్ దుర్గా ప్రసాద్, ఎక్స్ అఫీషియో మెంబర్ బృందావన దేశికాచార్యులు పాల్గొన్నారు. పూజ అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వేలాదిగా మంచినీటి ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సుమారు 5000 మందికి అన్నప్రసాద వితరణ గావించారు. మార్గశిర మాసోత్సవాలలో నెలరోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఇందులో భాగంగా గురువారం విజయజ్యోతిచే కూచిపూడి నృత్యప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. నేడు సుభద్రాదేవిచే అన్నమాచార్య కీర్తనలు గానం చేయబడును. మార్గశిర మాసోత్సవాలలో అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేయు భక్తుల సౌకర్యార్థం మొదటి లక్ష్మివారం మద్దిలపాలెం, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, వేపగుంట, గోపాలపట్నం, ఎన్ఏడి కొత్త రోడ్డు, కంచరపాలెం మీదుగా 2 సర్వీసులను నిరంతరం తిరిగే విధంగా ఏర్పాటు చేయడమైనది. ఒక బస్సును దేవస్థానం ఏర్పాటు చేయగా మరో బస్సును దాత జెర్రిపోతుల ప్రసాద్ ఏర్పాటు చేయడం జరిగింది.








VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com